

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 07 | సంచిక 211 | ఎడిటర్ : బరిగెల శివ | బుధవారం, 01, జులై 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్


# నిరుద్యోగుల్లో.. నిరాశలు !






**డాక్టర్ బరిగెల శివ**

జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్







హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)

నిరుద్యోగులను ఆదుకోవడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమవుతున్నాయని డాక్టర్ బరిగెల శివ వాక్యానించారు.దేశానికి మార్గదర్శకులుగా నిలుస్తున్న విద్యావంతులు ఉద్యోగాలు దొరక్క అరిగోశపడుతున్నారని అన్నారు.దేశ ప్రజలను ఎంతైతే ఇబ్బందులకు గురిచేస్తున్నారో నిరుద్యోగులను అంతకన్నా ఎక్కువగా వేధిస్తున్నారని పేర్కొన్నారు.నిరుద్యోగాన్ని పెంచి పోషించడం వల్ల దేశ ఆర్థిక అప్పులు తగ్గిపోవాల్సింది పోయి కేంద్ర ప్రభుత్వం బిజెపి హయాంలో ఇంచు మించు 200 లక్షల కోట్లకు దేశ అప్పు పెరిగిపోయిందని విమర్శించారు.దేశంలో అప్పులు పెరుగుతున్న కొలది అభివృద్ధి అదే స్థాయిలో పెరగాల్సింది పోయి దేశంలో జరుగుతున్న అభివృద్ధి ఎక్కడ కనిపించినప్పటికీ అప్పుల పెరుగుదల మాత్రం దేశ భవిష్యత్తును కాలరాసిందని గుర్తు చేశారు.దేశవ్యాప్తంగా పోరాటాలతో కదం తొక్కుతున్న నిరుద్యోగ యువత నిద్రాహారాలు మానేసి వాళ్ల భవిష్యత్తు లక్ష్యాలను సాధించుకోవడం కోసం ధర్నాల రూపంలో పోరు మార్గాలను ఎంచుకున్నారని గుర్తు చేశారు.కోట్ల ఉద్యోగాలు కేటాయించాల్సిన కేంద్ర

- మిగతా 2లో..

దేశవ్యాప్తంగా నిరుద్యోగుల ధర్నాలపై దాడులు చేయిస్తున్న కేంద్ర ప్రభుత్వం

దేశంలో పెరిగిపోతున్న నిరుద్యోగ యువత

ఉద్యోగాలు నింపనీకి మనుసొప్పని ప్రభుత్వాలు

నిలువ నీడకు నోచుకోని నిరుద్యోగులు

దేశంలో పెరిగిపోతున్న నిరుద్యోగుల ధర్నాలు

మొద్దు నిద్రలో ప్రభుత్వాలు

దేశాన్ని దివాలా తీయడమే కాకుండా నిరుద్యోగులను వేధిస్తున్నారు

దేశ జనాభాలో 26 శాతం పెరిగిన నిరుద్యోగలు

ఉద్యోగాల కోసం ప్రయత్నిస్తే కిరాతకంగా చంపుతున్నారు

దేశంలోని నిరుద్యోగులను అతికిరాతకంగా వేధిస్తున్నాడు

సెంట్రల్ విశ్వవిద్యాలయాలలో నింపుకున్న ఉద్యోగులంతా ఎవరు : డాక్టర్ బరిగెల శివ

## పదవి ఎవ్వరికీ శాశ్వతం కాదు

ఎన్టీఆర్, ఇందిర లాంటి వారే ఓడారు
పదవి శాశ్వతం అని నేను కూడా భావించడం లేదు
ఇచ్చిన హామీ మేరకు మంచి పనులు చేయడమే నా లక్ష్యం
రాష్ట్రాన్ని అప్పుల బారి నుంచి గాడిన పెడుతున్నాం
రైతులను రుణమాఫీ, రైతు భరోసాతో ఆదుకుంటున్నాం
బకాసురుడు కెసిఆర్ చేసిన అప్పులు తీర్చలేక చస్తున్నాం
కెసిఆర్ హాయంలో జీతాలు కూడా సక్కగ ఇవ్వలేదు
కన్నకూతరు ఫోన్లు కూడా ట్యాప్ చేసిన ఘనుడు
మళ్ళీ వస్తే ఫోన్ ట్యాపింగ్ తప్ప మరేమీ ఉండదు
రాష్ట్రంలో బిజెపి అధికారంలోకి వచ్చే ఛాన్స్ లేదు
శిల్పకళావేదిక సభలో సిఎం రేవంత్ విమర్శలు



5

## కావాలనే తెలంగాణపై బిజెపి కక్ష

ఎరువుల సరఫరాలో తీవ్ర నిర్లక్ష్యం బిజెపి, బిఆర్ఎస్ తీరుపై మండిపడ్డ మంత్రి పొన్నం



7

## వైభవంగా గోదావరి పుష్కరాల ఏర్పాట్లు

ధర్మపురిలో పుష్కర ఘాట్లను పరిశీలించిన మంత్రి అడ్లూరి



2

## డాక్టర్ బరిగెల శివకు డాక్టర్ సుగుణకర్ రాజ్ ఘన సన్మానం

జై భీమ్ శాలువాతో సత్కారం - సబ్‌మరినర్ పెన్నులను జ్ఞాపికగా అందజేత
అంబేద్కర్ ఆశయాల సాధన, సామాజిక న్యాయం, యువత చైతన్యంపై సుదీర్ఘ చర్చ



2

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE

# వైభవంగా గోదావరి పుష్కరాల ఏర్పాట్లు

**ధర్మపురిలో పుష్కర ఘాట్లను పరిశీలించిన మంత్రి అడ్లూరి**





**జగిత్యాల,జూన్ 30(జై భీమ్ న్యూస్):**

గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తామని తెలంగాణ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ వ్యాఖ్యానించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు. గోదావరి పుష్కరాల ఏర్పాట్లలో భాగంగా ధర్మపురిలోని పుష్కర ఘాట్లను మంత్రి అడ్లూరి పరిశీలించి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. గోదావరి పుష్కరాల కోసం ఏడాది ముందుగానే పనులను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. భక్తుల రద్దీ, మౌలిక వసతులు, భద్రతా ఏర్పాట్లు, పారిశుధ్యం, రవాణా సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని మంత్రి అడ్లూరి చెప్పుకొచ్చారు. ధర్మపురి, కోటిలింగాల వంటి ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో పుష్కరాల నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.117 కోట్ల నిధులను కేటాయించినట్లు తెలిపారు. ఈ నిధులతో ఘాట్ల అభివృద్ధి, రహదారుల విస్తరణ, తాగునీటి సదుపాయాలు, పారిశుధ్య వ్యవస్థలు, భక్తుల విశ్రాంతి కేంద్రాల నిర్మాణం వంటి పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. గత గోదావరి పుష్కరాల సందర్భంగా భక్తులు ఎదుర్కొన్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఈసారి మరింత మెరుగైన ఏర్పాట్లు చేయనున్నామని స్పష్టం చేశారు. రద్దీ నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణ, వైద్య సేవలు, అత్యవసర వ్యవస్థలను బలోపేతం చేసి భక్తులకు సౌకర్యవంతమైన వాతావరణాన్ని కల్పిస్తామని మంత్రి అడ్లూరి తెలిపారు. పుష్కరాల నిర్వహణలో అనుభవం ఉన్న కన్సల్టెన్సీల సహకారంతో పనులను ప్రణాళికాబద్ధంగా అమలు చేస్తామని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేసి గోదావరి పుష్కరాలను దేశవ్యాప్తంగా ఆదర్శవంతమైన ఆధ్యాత్మిక మహోత్సవంగా నిర్వహించడమే తమ లక్ష్యమని వివరించారు. పుష్కరాల ఏర్పాట్లకు సంబంధించిన పనులను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని చెప్పుకొచ్చారు. భక్తులకు అత్యుత్తమ సౌకర్యాలు అందించేలా చర్యలు తీసుకుంటామని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు.

## మామిడిరైతులు ఆందోళన చెందవద్దు

**అమరావతి,జూన్ 30(జై భీమ్ న్యూస్):**

మామిడి రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చిత్తూరు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. వారికి అండగా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటోందని అన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. గత ఏడాది కూడా కూటమి ప్రభుత్వం రైతులకు కేజీకి రూ.4 చెల్లించి అండగా నిలిచిందని గుర్తుచేశారు. ఈ ఏడాది కూడా కేజీకి రూ.4 ముందస్తు చెల్లించి మామిడి కొనుగోళ్లు కొనసాగిస్తున్నామని తెలిపారు. పంట దిగుబడి అధికంగా రావడంతో తాత్కాలికంగా కొనుగోళ్లపై ఒత్తిడి ఏర్పడిందని చెప్పారు. గత ఏడాది మామిడి రైతులకు సుమారు రూ.190 కోట్లు చెల్లించి ప్రభుత్వం ఆదుకుందన్నారు. రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని మంత్రి తెలిపారు. కొనుగోళ్లలో జాప్యం జరిగితే సంబంధిత ఫ్యాక్టరీలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి సంబంధించిన వైసీపీ సానుభూతి కంపెనీలు కొనుగోళ్లలో అలసత్వం ప్రదర్శిస్తే ఉపేక్షించమన్నారు. రైతుల ప్రయోజనాలే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని స్పష్టం చేశారు. రైతులను వైసీపీ.. రాజకీయాలకు వాడుకోవడం మానుకోవాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి హెచ్చరించారు.

## ఫీజు రియంబర్స్‌మెంట్‌పై విద్యార్థులకు ఊరట

హైదరాబాద్,జూన్ 30(జై భీమ్ న్యూస్): ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించిన పిటిషన్లపై విచారణను తెలంగాణ హైకోర్టు వచ్చే జులై 6వ తేదీకి వాయిదా వేసింది. ఈ కేసులో గత విచారణ సందర్భంగా జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వులు అప్పటివరకు కొనసాగుతాయని న్యాయస్థానం స్పష్టం చేసింది. గత విచారణలో విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ముఖ్యంగా విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేయరాదని పేర్కొంటూ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నంబర్-9లోని నాలుగు నిబంధనల అమలుపై తాత్కాలికంగా స్టే విధించింది. హైకోర్టు జారీ చేసిన ఈ మధ్యంతర ఉత్తర్వులు జులై 6వ తేదీ జరిగే తదుపరి విచారణ వరకు అమల్లో ఉంటాయని న్యాయస్థానం స్పష్టం చేసింది. దీంతో సంబంధిత విద్యాసంస్థలు, విద్యార్థులు, తల్లిదండ్రుల్లో నెలకొన్న అనిశ్చితికి తాత్కాలిక ఉపశమనం లభించినట్లైంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ విధానానికి సంబంధించిన వివిధ అంశాలపై పిటిషనర్లు కోర్టును ఆశ్రయించిన విషయం విదితమే. ఈ క్రమంలో ప్రభుత్వం తీసుకొచ్చిన జీవోలోని కొన్ని నిబంధనలపై అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో ఇరుపక్షాల వాదనలు విన్న హైకోర్టు తాత్కాలిక ఉత్తర్వులు జారీ చేసింది. జులై 6వ తేదీ జరగనున్న తదుపరి విచారణలో ప్రభుత్వం, పిటిషనర్ల వాదనలను పరిశీలించనుంది. అనంతరం హైకోర్టు మరిన్ని ఆదేశాలు జారీ చేసే అవకాశం ఉంది. ఈ కేసు తీర్పు రాష్ట్రంలోని వేలాది మంది విద్యార్థులు, విద్యాసంస్థలపై ప్రభావం చూపే అవకాశముండటంతో ఆసక్తి నెలకొంది.

# నిరుద్యోగుల్లో నిరాశలు

మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వం ఉద్యోగాల కోసం ప్రశ్నిస్తున్న యువతకు జవాబు చెప్పకుండా దాడులు చేయిస్తూ కేసులు పెట్టిస్తూ వాళ్ళ జీవితాలను విచక్షణారహితంగా అణిచివేస్తున్నారని తెలిపారు.ప్రజాస్వామ్యబద్ధంగా ఉద్యమాలు చేస్తున్న నిరుద్యోగ యువతను విచ్చలవిడిగా దాడులు చేస్తున్నారని హెచ్చరించారు.రాజకీయ పదవులు అనే హోదాలను అడ్డం పెట్టుకొని దేశ సంపదను దోచుకుంటూ ఉద్యోగాల కోసం పోరాడుతున్న యువతను వాళ్ల జీవితాలను కాలరాస్తుండడం కేంద్ర ప్రభుత్వానికి తగదన్నారు.పలు రాష్ట్రాల్లో జరుగుతున్న ధర్నాలకు జవాబుదారీతనాన్ని ప్రదర్శించాల్సిన ప్రభుత్వాలు బిజెపికి అనుకూలంగా లేని రాష్ట్ర ప్రభుత్వాలపై నెట్టివేస్తూ వాళ్ళు ఎందుకు ఉద్యోగాలు కేటాయిస్తలేరు అనే సంకేతాలను దేశవ్యాప్తంగా వ్యాపింపజేస్తూ ఉద్యోగాలు కేటాయించలేమని చేతులెత్తేసి తప్పించుకు తిరుగుతున్నారని హేళన చేశారు.ఉద్యోగాలు లభిస్తే తమ కుటుంబాలు నిలబడ్డట్టేనని భావించుకుంటున్న నిరుద్యోగులు 15 సంవత్సరాలుగా లైబ్రరీలలో కూర్చుండి చదువుకుంటున్నారని వాళ్ళ బాధను వాళ్ళ కష్టాన్ని వాళ్ళ నిరుద్యోగ నష్టాన్ని పరిగణలోనికి తీసుకొని వాళ్లకు కావాల్సిన ఉద్యోగాలను కల్పించాల్సిన ప్రభుత్వాలు ప్రతి పార్లమెంట్ సభలో నిరుద్యోగ యువత ఊసే ఎత్తకుండా పార్లమెంటు సమావేశాలను ముగింపు చేస్తున్నారని దాని ప్రభావం వల్ల ఆయా రాష్ట్రాల్లో నిరుద్యోగ యువత జీవితాలు అంధకారంగా మారిపోతున్నప్పటికిని ప్రభుత్వాల మొండితనం నిరుద్యోగ యువతను నాశనం చేస్తుందని గుర్తుచేశారు.

### నిరుద్యోగులను నిలువునా ముంచేస్తున్నారు..

దేశ పరిస్థితులను గమనిస్తున్నప్పుడు ప్రతి రాష్ట్రంలో ప్రభుత్వ కార్యాలయాలలో ఉద్యోగ ఖాళీలు లెక్కలేనన్ని పెరిగిపోతుండగా ప్రభుత్వ కార్యాలయాలు చాలీచాలని ఉద్యోగులతో కార్యాలయాల సేవలను నెట్టుకు రాగలుగుతున్నారని అదే సందర్భంలో ప్రతి రాష్ట్రంలో ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ఖాళీలను భర్తీ చేయడానికి ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు పలుమార్లు నిరుద్యోగులకు హామీలిస్తూ, భరోసాను కల్పిస్తూ ఉద్యోగ నియామక ప్రక్రియలు జరుపుతామంటూ నమ్మకం కల్పిస్తూ నోటిఫికేషన్ విడుదల చేయాల్సింది పోయి ఉన్న ప్రభుత్వ కార్యాలయాలను నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తున్నారని అందులో భాగంగానే ప్రతి రాష్ట్రంలో ప్రధాన ప్రభుత్వ కార్యాలయాన్ని మూతపడే స్థాయికి వచ్చాయన్నారు.దేశవ్యాప్తంగా ఒకే వర్గానికి చెందిన సమాజం మాత్రం ఉన్నత స్థాయిలో అభివృద్ధి చెందుతుందని రాజకీయపరంగా ఉద్యోగపరంగా ఆర్థికపరంగా అత్యంత సంపన్నమైన స్థితికి చేరుకున్నది మాత్రం బిజెపి రాజకీయ వర్గం సామాజిక పార్టీకి చెందిన వాళ్లేనంటూ సూటిగా నిలదీశారు.కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల్లో సెంట్రల్ యూనివర్సిటీలలో 12 సంవత్సరాలలో నింపబడిన ఉద్యోగులందరూ, అధికారులు అందరూ కేవలం బిజెపి అనుబంధ సంస్థకు సంబంధించిన వాళ్లేనని అలా 12 సంవత్సరాలుగా కొన్నిచోట్ల నోటిఫికేషన్ లేకుండా లెక్కలేనంత మందిని ఉన్నతమైన ఉద్యోగాలలో నింపుకున్నారని గుర్తు చేశారు. అన్ని రాష్ట్రాలకు ఉద్యోగుల భర్తీ కోసం నిర్దిష్టమైన ఆర్డర్లను మంజూరు చేస్తూ నిరుద్యోగులకు ఉద్యోగాలకు కేటాయించడానికి తగిన చర్యలు చేపట్టాల్సిందిగా, ఆయత్త పర్చాల్సింది పోయి కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉన్న ప్రభుత్వ కార్యాలయంలోని ఉద్యోగులు, ఉద్యోగాలు ఖాళీ అవుతున్న సందర్భాలను దేశ ప్రజలకు దేశ నిరుద్యోగులకు ఏమాత్రం తెలియనీయకుండా జాగ్రత్త పడుతూ ఉద్యోగ నియామకాల వేటలో మైళ్ళ దూరం వెనకల్లో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు నిరుద్యోగ యువత అనేసరికి ప్రభుత్వాలకు ఎందుకు ఇంత చిన్నచూపో తెలియదు గానీ ప్రజా ప్రతినిధుల ఆస్తులు ఊహించినంతగా పెరిగిపోతుండగా నిరుద్యోగ యువత చదువులు పూర్తి చేసుకుని విపరీతమైన జీవిత భారాన్ని మోస్తున్నారని గుర్తు చేశారు.దేశంలో 33 కోట్ల దేవుళ్ళు ఉన్నారని 140 కోట్ల జనం విశ్వసిస్తుండగా ఈ దేశంలో యువతకు ఉద్యోగాలు లేవు చదువుకునేందుకు డబ్బులు లేకపోయినప్పటికీ బాబాల ఆస్తులు మాత్రం లక్షల కోట్లు దాటుతున్నాయని మండిపడ్డారు.దేశ ప్రజలకు దేశ యువతకు మారుమూల ప్రాంత ప్రజలకు చదువును దూరం చేస్తే ప్రజల్లో పరిజ్ఞానం తగ్గిపోగలదని భావిస్తున్న కేంద్ర ప్రభుత్వం దేశ ప్రజలను 100 సంవత్సరాల వెనక్కి నెట్టేస్తూ అనాగరికులుగా,అంటరాని వాళ్లనుగా గుర్తించబడే విధంగా దేశ ప్రజల మధ్య దేశంలోని నిరుద్యోగుల మధ్య రాగద్వేషాలను పెంచి పోషిస్తూ ఉద్యోగాల కోసం పోరాటాలు చేస్తున్న యువతపైకి బిజెపి అనుబంధ యువతను దాడులకు పంపిస్తూ వాళ్లను వాళ్ల కుటుంబాలను చిత్రవధకు గురి చేసే విధంగా వేధింపుల పాలు చేస్తున్నారని హెచ్చరించారు.ప్రపంచ దేశాలతో భారతదేశాన్ని పోల్చి చూసినప్పుడు ఇతర దేశాలలో సాంకేతికపరంగా సైన్స్ పరంగా పరిశోధన పరంగా విద్యా పరంగా భారతదేశానికన్నా ఎన్నో రేట్లు మెరుగు పొందుతున్నారని భారత దేశంలో మాత్రం యువతను పనికిరాని వాళ్ళుగా చేస్తూ బిజెపి రాజకీయ పార్టీ కబంధహస్తాల్లోనికి తీసుకొని దేశ రాజకీయాలను శాసించే విధంగా ఇతర రాజకీయ పార్టీల యువతను ఇతర రాజకీయ పార్టీల నాయకులను దేశంలో ఉద్యోగాల కోసం ధర్నా చేస్తున్న నిరుద్యోగులను విచ్చలవిడిగా కొట్టిస్తున్నారని ప్రతి రాష్ట్రంలో జరుగుతున్న దాడులకు సీసీ కెమెరాలు ఆధారంగా పోలీస్ అధికారులే సాక్షులంటూ గుర్తు చేశారు.ప్రభుత్వ కార్యాలయాలను ప్రైవేట్ కార్యాలయాలను ఏమాత్రం మినహాయింపు లేకుండా అల్లరి మూకలతో దాడులు చేయిస్తూ సోషల్ మీడియాను వాట్సాప్ గ్రూపులలో షేర్ చేస్తూ ఇతర నిరుద్యోగ యువకులపై ఇతర ఉద్యోగ వర్గాలపై క్రూర మృగాలు దాడులు చేసినట్లుగా ప్రవర్తిస్తున్నారని దేశంలో నిరుద్యోగుల పక్షాన మాట్లాడలేని మేధావులు దేశ భవిష్యత్తును అనాగరికులకు చదువు రాని వాళ్లకు తాకట్టు పెడుతున్నారని దేశ భవిష్యత్తు యువత చేతిలో ఉంటుండగా దేశాన్ని రక్షించుకోవడానికి దేశానికి పాలించుకోవడానికి దేశ రాజకీయాల్లో విప్లవాత్మకమైన మార్పులు తీసుకురావడానికి నిరుద్యోగ యువతతో పాటు దేశ యువత యుద్ధ ప్రాతిపదికన సిద్ధపడాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు.దేశవ్యాప్తంగా సెంట్రల్ యూనివర్సిటీలతో పాటు రాష్ట్ర యూనివర్సిటీలలో విచ్చలవిడిగా పెరిగిపోతున్న గంజాయి వ్యాపకాలను డ్రగ్స్ వ్యాపకాలను నియంత్రిస్తూ యువత ప్రాణాలను నిరుద్యోగుల ఆత్మగౌరవాన్ని కాపాడాలని బాధ్యత కలిగిన యువతకు గుర్తు చేశారు.దేశవ్యాప్తంగా నిరుద్యోగ యువత చేస్తున్న పోరాటాలకు పూర్తి మద్దతునిస్తూ సహకరించాలని అదేవిధంగా ప్రభుత్వాలు మొండి వైఖరిని నిలదీస్తూ ఉద్యోగాలు సంపాదించుకొనుటకు రాజీలేని పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు.కడుపు నిండిన వానికి కడుపు మాడినోనికి ఎంతటి తేడా ఉంటుందో వ్యవస్థలను నాశనం చేసే వాళ్ల దగ్గర బానిస బతుకు బతికే యువత కన్నా వ్యవస్థను అన్ని విధాలుగా రక్షించుకుంటూ 10 తరాలపాటు నిలుపుకొనుట కొరకు ప్రయాసపడే యువతకు మాత్రమే ఎక్కువ బాధ్యత ఉంటుందంటూ మరొకసారి గుర్తు చేస్తూ కేంద్ర ప్రభుత్వం గానీ ఇతర రాష్ట్ర ప్రభుత్వాలు గానీ నిరుద్యోగ యువతను ఇబ్బందులకు గురి చేస్తే పుట్టగతులు ఉండవని హెచ్చరించారు.



# తెలంగాణ హైకోర్టులో స్థానికులకే ప్రభుత్వ న్యాయ అవకాశాలు కల్పించాలి

**జీపీలు, ప్రత్యేక ప్రభుత్వ ప్లీడర్లు, అదనపు ప్రభుత్వ ప్లీడర్ల నియామకాలలో స్థానికులకే ప్రాధాన్యం ఇవ్వాలని ఎస్సీ న్యాయవాదుల డిమాండ్**

**హైదరాబాద్,జూన్ 30** (జై భీమ్ న్యూస్)

తెలంగాణ హైకోర్టులో ప్రభుత్వ ప్లీడర్లు, ప్రత్యేక ప్రభుత్వ ప్లీడర్లు, అదనపు ప్రభుత్వ ప్లీడర్ల నియామకాలలో తెలంగాణకు చెందిన స్థానిక న్యాయవాదులకు కాకుండా ఇతర రాష్ట్రాలకు చెందిన సెటిలర్లకు అవకాశాలు కల్పించడం అన్యాయమని తెలంగాణ హైకోర్టులో ప్రాక్టీస్ చేస్తున్న ఎస్సీ (షెడ్యూల్డ్ కులాల) న్యాయవాదులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో సుమారు 55 మంది ఎస్సీ న్యాయవాదుల సంతకాలతో ఒక ప్రతినిధి పత్రాన్ని సిద్ధం చేసి అడ్వకేట్ జనరల్‌కు సమర్పించారు. అదే ప్రతిని రాష్ట్ర ముఖ్యమంత్రి, న్యాయశాఖ కార్యదర్శి, సంబంధిత మంత్రులకు కూడా పంపినట్లు తెలిపారు. ఎన్నో పోరాటాలు, త్యాగాలు, బలిదానాల ఫలితంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో స్థానిక న్యాయవాదులను పక్కనపెట్టి ఇతర రాష్ట్రాలకు చెందిన వారిని ప్రభుత్వ న్యాయ పదవుల్లో నియమించడం తెలంగాణ ఆత్మను దెబ్బతీసే చర్య అని వారు పేర్కొన్నారు. ప్రభుత్వ ప్లీడర్లుగా నియమితులైన వారికి భవిష్యత్తులో న్యాయమూర్తులుగా ఎదిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, ఈ విధంగా కొనసాగితే తెలంగాణకు చెందిన ముఖ్యంగా ఎస్సీ న్యాయవాదులకు అవకాశాలు దూరమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. స్థానికుల హక్కులను కాలరాసే ప్రయత్నాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని, అవసరమైతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మహారాష్ట్రలో స్థానిక న్యాయవాదులకు ప్రాధాన్యం కల్పించాలని అక్కడి న్యాయవాదులు ఉద్యమించిన విషయాన్ని గుర్తు చేస్తూ, తెలంగాణలో కూడా స్థానికుల హక్కుల పరిరక్షణ కోసం ఐక్యంగా పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. హైకోర్టులో ఈ అంశంపై చర్చలు జరుగుతున్న సమయంలో ఇద్దరు ప్రభుత్వ న్యాయవాదులు రాజీనామా చేసినట్లు సమాచారం ఉందని పేర్కొన్నారు. ఈ సంతకాల సేకరణ కార్యక్రమాన్ని తెలంగాణ హైకోర్టులో ప్రాక్టీస్ చేస్తున్న షెడ్యూల్డ్ కులాల న్యాయవాదులు నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ అడ్వకేట్స్ అసోసియేషన్ ఫర్ మాదిగ కన్వీనర్ దున్న అంబేద్కర్ మాట్లాడుతూ, తెలంగాణ భూమి పుత్రులకే ప్రభుత్వ న్యాయ పదవుల్లో తగిన ప్రాధాన్యం కల్పించాలని, స్థానిక న్యాయవాదుల హక్కుల పరిరక్షణ కోసం తమ ఉద్యమం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

# డాక్టర్ బరిగెల శివకు డాక్టర్ సుగుణకర్ రాజ్ ఘన సన్మానం

**జై భీమ్ శాలువాతో సత్కారం - సబ్‌మరినర్ పెన్నులను జ్ఞాపికగా అందజేత**
**అంబేద్కర్ ఆశయాల సాధన, సామాజిక న్యాయం, యువత చైతన్యంపై సుదీర్ఘ చర్చ**

**జనగాం, 30 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

జై భీమ్ టీవీ వ్యవస్థాపకులు, చైర్మన్ డాక్టర్ బరిగెల శివను ప్రముఖ సామాజికవేత్త డాక్టర్ సుగుణకర్ రాజ్ ఘనంగా సన్మానించారు. జనగాంలోని తన నివాసంలో డాక్టర్ సుగుణకర్ రాజ్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన డాక్టర్ బరిగెల శివతో ఆయన ఆత్మీయంగా సమావేశమై పలు సామాజిక, విద్యా, ప్రజా చైతన్య అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుగుణకర్ రాజ్, డాక్టర్ బరిగెల శివకు ప్రత్యేకంగా జై భీమ్ శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. అనంతరం ప్రేమాభిమానాలకు గుర్తుగా నాణ్యమైన సబ్‌మరినర్ పెన్నులను జ్ఞాపికగా బహూకరించారు. ఈ సత్కారం పరస్పర గౌరవానికి, స్నేహానికి, సమాజ సేవ పట్ల ఇద్దరికీ ఉన్న అంకితభావానికి ప్రతీకగా నిలిచింది. సమావేశంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలను మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరంపై ఇద్దరూ అభిప్రాయపడ్డారు. సామాజిక న్యాయం సాధన, దళిత--బహుజన సమాజ అభ్యున్నతి, విద్య ద్వారా సామాజిక మార్పు, యువతలో రాజ్యాంగ విలువలపై అవగాహన పెంపు, సమానత్వ భావన, ప్రజాస్వామ్య పరిరక్షణ వంటి పలు కీలక అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. అదేవిధంగా సమాజంలో చైతన్యాన్ని పెంపొందించేందుకు మీడియా పాత్ర ఎంతో కీలకమని, ప్రజల సమస్యలను నిష్పక్షపాతంగా వెలుగులోకి తీసుకురావడంతో పాటు రాజ్యాంగ విలువలను ప్రజల్లో బలంగా నాటేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సమావేశంలో అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఈ ఆత్మీయ భేటీ పరస్పర గౌరవం, స్నేహబంధం, సామాజిక సేవ పట్ల ఉన్న నిబద్ధతను మరింత బలోపేతం చేసిన సందర్భంగా పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో రవి, సాయి, వెంకట్ తదితరులు పాల్గొని ఈ ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేశారు.



# ప్రభుత్వ పాఠశాలలలో కనీస వసతులను కల్పించాలి







**హన్మకొండ డీఈఓ ఆఫీస్ ముందు పిడిఎస్యు ధర్నా జూన్ 18 నుండి 26 వరకు ప్రభుత్వ పాఠశాల సర్వే నిర్వహించి ఉమ్మడి వరంగల్ జిల్లాలలో 60 పాఠశాలలో సమస్యల సేకరణ**

**హన్మకొండ జై భీమ్ న్యూస్:-**

బుధవారం పిడిఎస్యు ఉమ్మడి వరంగల్ కార్యవర్గం ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల సమస్యలపై డీఈఓ ఆఫీస్ ముందు ధర్నా నిర్వహించడం ధర్నా తరువాత డిఈఓ గారికి వినతి పత్రం మరియు సర్వే పత్రాలను అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు గుర్రం అజయ్ మాట్లాడుతూలి త్రాగునీరు లేదని గ్రౌండ్ లేదని, గ్రంధాలయాలు లేవని కంప్యూటర్ ల్యాబ్లు లెవ్వని తక్షణమే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి మహేష్ మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లాలో గీసుకొండ, సంగెం, ఆత్మకూరు,దామెర, దుగ్గొండి, నర్సంపేట, వరంగల్ ఖిల్లా, వరంగల్,హనుమకొండ హసన్ పర్తి,కాజీపేట మండలాల్లో పిడిఎస్యు సర్వే నిర్వహించిందని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇంతవరకు ఏ పాఠశాలలో స్థానిక ఎమ్మెల్యే కానీ మంత్రి గాని ఒక్క స్కూలు కూడా విసిట్ చేయలేదని కొన్ని పాఠశాలలో కొన్ని రకమైన సమస్యలు ఉంటే మరికొన్ని పాఠశాలలో మరొక రకమైన సమస్యలు ఉన్నాయని అనేక పాఠశాలలో లలో 1వ తరగతి నుండి 5వ తరగతి గదికి ఒక టీచర్ లేరని ఒకరిద్దరు మాత్రమే ఉన్నారని,6 నుండి 10 తరగతి వరకు సబ్జెక్ట్ ఒక టీచర్ లేరని, 1వ నుండి 5వ తరగతి విద్యార్థులను ఒకే గదిలో కూర్చోబెడుతున్నారని, మూత్రశాలలు లేని పాఠశాలలు ఉన్నాయని ఉన్న పాఠశాలలో సరిపడా మూత్రశాల లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కనీస సౌకర్యాలు కూడా ప్రభుత్వ పాఠశాలలో కాంగ్రెస్ 27 వేల పాఠశాలలను నాలుగు వేలకే కొద్దిపేస్తాం అనడం సిగ్గుచేటు బడిబాట కార్యక్రమం చేపడుతూ కనీస సౌకర్యాలు కల్పించకుండా ప్రభుత్వ విద్యపై పేద విద్యార్థులపై సవితి ప్రేమ చూపెడుతుందని మండిపడ్డారు పాఠశాల చుట్టుపక్కల మద్యం షాపులు వెలిశాయని పరహారి గోడ వంట శాలలు లేవని అన్నారు,పాఠశాల గ్రౌండ్ లోనే ఊరు గొడవల పంచాయతీలు జరుగుతున్నాయని ప్రభుత్వ పాఠశాలలపై ఏమాత్రం సిద్ధ శుద్ధి ఉన్న తక్షణమే ఈ సమస్యలను పరిష్కరించాలని లేనియెడల పెద్ద ఎత్తున విద్యార్థులతో కలిసి ఉద్యమాలు నిర్మిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్యూ ఉమ్మడి వరంగల్ జిల్లా కోశాధికారి నందిని సభ్యులు వంగెటిమోహన్, ఫర్హాన్, నాయకులు మహేంద్ర,రమణ యూనివర్సిటీ నాయకులు రాజేష్,రాంబాబు తదితరులు పాల్గొన్నారు. విప్లవాభివందనాలతో.. మర్రి మహేష్. పిడీఎస్యూ స్తూఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి. సెల్ :-9688128552.

# కేయూలో అండర్ స్టాండింగ్ ద్రవిడియన్ సొసైటీ అండ్ పాలిటిక్స్ పుస్తకావిష్కరణ

**హన్మకొండ, 30 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

కాకతీయ విశ్వవిద్యాలయం రాజనీతి శాస్త్ర విభాగంలోని అలుమ్నీ హాలులో మంగళవారం ద్రవిడియన్ పొలిటికల్ సైన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో “అండర్స్టాండింగ్ ద్రవిడియన్ సొసైటీ అండ్ పాలిటిక్స్ “ పేరుతో రూపొందించిన సదస్సు ప్రొసీడింగ్స్ పుస్తకాన్ని ఘనంగా ఆవిష్కరించారు. ఈ పుస్తకం మే 9, 10 తేదీల్లో నిర్వహించిన జాతీయ ఆన్‌లైన్ సదస్సులో సమర్పించిన పరిశోధనా పత్రాల సంకలనంగా వెలువడింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కాకతీయ విశ్వవిద్యాలయ గౌరవ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి. రామచంద్రం పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. జాతీయ సదస్సుల్లో సమర్పించిన పరిశోధనా పత్రాలను పుస్తక రూపంలో ప్రచురించడం పరిశోధకులకు గొప్ప గుర్తింపును, విలువైన అవకాశాన్ని కల్పిస్తుందని పేర్కొన్నారు. ఇలాంటి శాస్త్రీయ సదస్సులను మరింత విస్తృతంగా నిర్వహించి విద్యార్థులు, అధ్యాపకులు, పరిశోధకులు సమాజానికి ఉపయోగపడే పరిశోధనలు చేయాలని సూచించారు. గౌరవ అతిథిగా పాల్గొన్న రాజనీతి శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ గడ్డం కృష్ణయ్య మాట్లాడుతూ ద్రవిడియన్ పొలిటికల్ సైన్స్ అసోసియేషన్ దక్షిణాది రాష్ట్రాల సంస్కృతి, సంప్రదాయాలు, రాజకీయ



పరిణామాలు, ప్రజల అవసరాలు, ఉత్తరాది రాష్ట్రాలతో ఉన్న సామాజిక-రాజకీయ సంబంధాలపై సమగ్ర చర్చకు వేదిక కల్పించడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో కూడా ద్రవిడియన్ సమాజానికి సంబంధించిన అంశాలపై మరిన్ని జాతీయ, అంతర్జాతీయ సదస్సులు నిర్వహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాజనీతి శాస్త్ర మాజీ విభాగాధిపతి డాక్టర్ సంకినేని వెంకటయ్య, పీవీ నరసింహారావు నాలెడ్జ్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ వడ్లకొండ సత్యనారాయణ ప్రత్యేకంగా పాల్గొని పుస్తక రచయితలు, సంపాదకులను అభినందించారు. సభకు ద్రవిడియన్ పొలిటికల్ సైన్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ పాలమాకుల కొమురయ్య అధ్యక్షత వహించగా, అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ నాగరాజు వాడపల్లి పుస్తక ప్రచురణ, జాతీయ సదస్సుల ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు డాక్టర్ సోమలింగం, సహాయ కార్యదర్శి జి. నరేష్ కుమార్, డాక్టర్ కల్లేపల్లి ప్రశాంత్ (కోశాధికారి), కార్యవర్గ సభ్యులు జి. సురేష్, లీలావతి బిట్ట, పరిశోధక విద్యార్థిని రుబీనా, అలాగే పరిశోధకులు, అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ వివరాలను ద్రవిడియన్ పొలిటికల్ సైన్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ పాలమాకుల కొమురయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

# పదవీ విరమణ అనంతరం ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి: వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్

**వరంగల్, 30 జూన్ 2026 (జై భీమ్ న్యూస్)**

పదవీ విరమణ అనంతరం పోలీస్ అధికారులు తమ వ్యక్తిగత ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించడంతో పాటు కుటుంబ సభ్యులతో ఎక్కువ సమయం గడపాలని వరంగల్ పోలీస్ కమిషనర్ లిసన్‌ప్రిత్ సింగ్‌లి సూచించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో సుదీర్ఘకాలం సేవలందించి మంగళవారం పదవీ విరమణ చేసిన పోలీస్ అధికారులకు నిర్వహించిన వీడ్కోలు, సన్మాన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని జ్ఞాపికలు అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, పోలీస్ ఉద్యోగం ఎంతో బాధ్యతాయుతమైనదని, విధి నిర్వహణలో క్రమశిక్షణ, అంకితభావంతో పనిచేసిన అధికారులు నేటి తరం పోలీసులకు ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం తమ సేవా కాలమంతా అహర్నిశలు శ్రమించిన అధికారులు ఇకపై కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపడమే కాకుండా, సమాజ సేవా కార్యక్రమాల్లో కూడా చురుకుగా పాల్గొనాలని సూచించారు. పదవీ విరమణ అనంతరం ఆరోగ్యాన్ని కాపాడుకోవడం, క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ రవి, ఎస్ఐలు విజయ్‌కుమార్, రాజయ్య, రవీందర్ రెడ్డి, విజయ్‌కుమార్, జనార్ధన్, అమరేందర్ రెడ్డి, లక్ష్మారెడ్డి, సంపత్, రమేష్, ఏఎస్ఐలు రమేష్, రాంధన్, బుచ్చయ్య, నర్సింగరావు, సత్తయ్య, హెడ్ కానిస్టేబుళ్లు రవికుమార్, ప్రభాకర్, కుమారస్వామి, సత్యదేవ్, కానిస్టేబుళ్లు గ్యామ, సుధాకర్, సలావుద్దీన్ పదవీ విరమణ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీలు సురేష్‌కుమార్, శ్రీనివాస్, ఏసీపీలు అంతయ్య, సురేంద్ర, ఆర్ఐలు సతీష్, స్పర్జన్ రాజ్, హనుమకొండ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, ఆర్ఎస్ఐ శ్రావణ్‌కుమార్‌తో పాటు ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది, పదవీ విరమణ చేసిన అధికారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. పదవీ విరమణ చేసిన అధికారుల సేవలను స్మరించుకుంటూ వారికి ఘనంగా వీడ్కోలు పలికారు.



# కెంబతహళ్లి నివాసితులకు ప్రాథమిక సౌకర్యాలు కల్పించండి





**బెంగళూరు జై భీమ్ న్యూస్ :**

బెంగళూరు నగరంలోని కెంబతహళ్లి వాసులకు మౌలిక వసతులు కల్పించాలని కర్ణాటక జనందోళన సంఘటన డిమాండ్ చేసింది. ఈ విషయమై ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు మరియప్ప, నాయకులు సిద్దలింగప్ప, మడివాల చంద్రప్ప, కన్నల్లి కృష్ణప్ప, సిద్ధాపుర మంజునాథ్, రత్నమ్మ, మంజమ్మ, ఉష తదితరులు దక్షిణ మండలం కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. కెంబత్తహళ్లి గ్రామంలో ఇళ్లు కట్టుకున్న నివాసితులకు తక్షణమే ప్రాథమిక సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ వారు బెంగళూరు దక్షిణ జోన్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. కెంబత్తహళ్లిలో నివసిస్తున్న వారిలో ఎక్కువ మంది దళిత వర్గానికి చెందినవారు మరియు చాలా సంవత్సరాలుగా అక్కడే నివసిస్తున్నారు. వారు తాగునీరు, రోడ్లు, విద్యుత్ సౌకర్యాలు లేక మరియు చెత్త పారవేసే పని చేస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అందువల్ల, వారికి అవసరమైన ప్రాథమిక సౌకర్యాలను తక్షణమే కల్పించాలని జనందోలన సంస్థ డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా వందలాది మంది నిరుపేదలు పాల్గొన్నారు.

# ఆర్ అండ్ బి హనుమకొండ సర్కిల్ ఎస్ఈగా బాధ్యతలు చేపట్టిన పి. సురేష్ బాబు

**హన్మకొండ, 30 జూన్ 2026 (జై భీమ్ న్యూస్)**



రహదారులు మరియు భవనాల (ఆర్ అండ్ బి) శాఖ హనుమకొండ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఎస్ఈ)గా పి. సురేష్ బాబు మంగళవారం అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల పదోన్నతి పొందిన ఆయన, ఇప్పటివరకు హనుమకొండ జిల్లా రహదారులు మరియు భవనాల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా సేవలందిస్తూ ఎస్ఈ హోదాకు పదోన్నతి పొందారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం సురేష్ బాబు మాట్లాడుతూ హనుమకొండ సర్కిల్ పరిధిలోని హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్ జిల్లాల్లో రహదారులు, ప్రభుత్వ భవనాల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, శాఖ ఇంజనీర్లు, కాంట్రాక్టర్లతో సమన్వయంతో పనిచేస్తూ అభివృద్ధి పనులను వేగవంతంగా, నాణ్యతతో పూర్తి చేసేందుకు కృషి చేస్తానన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా అన్ని అభివృద్ధి కార్యక్రమాలను పారదర్శకంగా అమలు చేస్తూ, నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు, ప్రభుత్వ భవనాల నిర్మాణం, నిర్వహణలో ప్రత్యేక దృష్టి సారించి ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తానని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా రహదారులు మరియు భవనాల శాఖ అధికారులు, ఇంజనీర్లు, సిబ్బంది పి. సురేష్ బాబుకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

# కాకతీయ విశ్వవిద్యాలయ పరిశోధక విద్యార్థి హరిప్రసాద్ కుల్లకు డాక్టరేట్

**హన్మకొండ, 30 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**



కాకతీయ విశ్వవిద్యాలయం న్యాయశాస్త్ర విభాగానికి చెందిన పరిశోధక విద్యార్థి హరిప్రసాద్ కుల్లకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య రాజేందర్ కట్ల ప్రకటించారు. హరిప్రసాద్ కుల్ల “భారతదేశంలో ప్రత్యామ్నాయ వివాద పరిష్కార వ్యవస్థ -- 2023 మధ్యవర్తిత్వ చట్టం ప్రత్యేక సందర్భంలో ఒక అధ్యయనం” అనే అంశంపై తన పరిశోధనను పూర్తి చేశారు. ఈ పరిశోధనను న్యాయశాస్త్ర విభాగ విశ్రాంత ఆచార్యులు ఆచార్య ఎన్. సుదర్శన్ పర్యవేక్షణలో నిర్వహించారు. వరంగల్‌కు చెందిన డాక్టర్ హరిప్రసాద్ కుల్ల ప్రస్తుతం కాకతీయ విశ్వవిద్యాలయం న్యాయ కళాశాలలో పార్ట్‌టైమ్ అధ్యాపకుడిగా సేవలందిస్తున్నారు. ప్రత్యామ్నాయ వివాద పరిష్కార విధానాలు, ముఖ్యంగా మధ్యవర్తిత్వ చట్టం--2023 అమలు, ప్రాముఖ్యత, న్యాయ వ్యవస్థపై దాని ప్రభావాన్ని తన పరిశోధనలో సమగ్రంగా విశ్లేషించారు. డాక్టరేట్ ప్రకటించిన సందర్భంగా విశ్వవిద్యాలయం న్యాయశాస్త్ర విభాగంలోని బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధక విద్యార్థులు, సహచర అధ్యాపకులు డాక్టర్ హరిప్రసాద్ కుల్లకు అభినందనలు తెలియజేస్తూ, ఆయన భవిష్యత్తులో విద్యా, పరిశోధనా రంగాల్లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE Jai Bheem

# నేరం చేస్తే తప్పనిసరిగా శిక్ష పడుతుందనే భయం నిందితుల్లో కలగాలి: వరంగల్ సీపీ సన్‌ప్రీత్ సింగ్






**వరంగల్, 30 జూన్ 2026 (జై భీమ్ క్రైమ్ న్యూస్)**

నేరాలకు పాల్పడిన వారికి చట్టప్రకారం తప్పనిసరిగా శిక్ష పడుతుందనే భయం నిందితుల్లో కలిగేలా పోలీసులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు సమన్వయంతో పనిచేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ అన్నారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వివిధ కేసుల్లో నిందితులకు కోర్టుల ద్వారా శిక్షలు పడేలా కృషి చేసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, దర్యాప్తు అధికారులు, కోర్టు విధులు నిర్వహించే పోలీస్ సిబ్బందిని మంగళవారం కమిషనరేట్ కార్యాలయంలో ప్రశంసాపత్రాలతో సత్కరించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ గత ఏడాది జూలై నుంచి ఇప్పటి వరకు వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని 41 క్రిమినల్ కేసుల్లో నిందితులకు కోర్టులు శిక్షలు విధించాయని తెలిపారు. వాటిలో చెన్నారావుపేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన జంట హత్యల కేసులో నిందితుడికి ఉరిశిక్ష విధించడం విశేషమన్నారు. అలాగే పలు కేసుల్లో యావజ్జీవ కారాగార శిక్షలు, 20 ఏళ్ల కఠిన కారాగార శిక్షలు కూడా విధించబడినట్లు వెల్లడించారు. నిందితులకు శిక్షలు పడేలా చేయడంలో దర్యాప్తు అధికారులు, పోలీస్ సిబ్బంది, పబ్లిక్ ప్రాసిక్యూటర్ల సమిష్టి కృషి అభినందనీయమని సీపీ పేర్కొన్నారు. ఈ కృషి ఫలితంగా నేర నిరూపణ శాతం 7 శాతం మేర పెరిగిందని తెలిపారు. ఇటీవల నిర్వహించిన లోక్ అదాలత్‌లో కూడా అత్యధిక కేసులను విజయవంతంగా పరిష్కరించడం పోలీసు శాఖ సమర్థతకు నిదర్శనమన్నారు. కేవలం కేసులు నమోదు చేసి దర్యాప్తు పూర్తి చేయడమే కాకుండా, నిందితులకు కోర్టులో శిక్ష పడే వరకు పోలీసులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సన్‌ప్రీత్ సింగ్ సూచించారు. నేరస్థులకు శిక్షలు ఖరారైనప్పుడే పోలీసు వ్యవస్థపై ప్రజల విశ్వాసం మరింత బలపడుతుందని, అలాగే నేరాల నియంత్రణ కూడా సాధ్యమవుతుందని పేర్కొన్నారు. కేసుల తుది తీర్పు వచ్చే వరకు దర్యాప్తు అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అనంతరం పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, దర్యాప్తు అధికారులు, కోర్టు విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బందికి సీపీ ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ దారా కవిత, ప్రాసిక్యూషన్ జాయింట్ డైరెక్టర్ రాము, ఏసీపీలు డేవిడ్‌రాజు, సతీష్‌బాబు, సదయ్య, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు శ్రీనివాస్, సంతోషి, రవి కిరణ్, హరిచంద్ర ప్రసాద్, బృందాదేవి, దుర్గాబాయి, రాజమల్లారెడ్డి, శ్రీధర్ రెడ్డి, రవీందర్ రావు, కిరణ్ కుమార్, నిజర్, ఇన్‌స్పెక్టర్లు సంజీవ్ రావు, మల్లయ్యతో పాటు ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కేయూ తెలుగు విభాగంలో 2026--27 విద్యా సంవత్సరానికి నూతన తెలుగు సిలబస్‌కు ఆమోదం



**హన్మకొండ, 30 జూన్ 2026 (జై భీమ్ న్యూస్)**

కాకతీయ విశ్వవిద్యాలయం తెలుగు విభాగంలో 2026--27 విద్యా సంవత్సరానికి సంబంధించిన నూతన తెలుగు సిలబస్‌కు పాఠ్య ప్రణాళిక సంఘం (బోర్డ్ ఆఫ్ స్టడీస్ - బీఓఎస్) ఆమోదం తెలిపింది. ఈ మేరకు మంగళవారం తెలుగు విభాగంలో పాఠ్య ప్రణాళిక సంఘం అధ్యక్షుడు డా. చిర్ర రాజు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పీజీ నాలుగు సెమిస్టర్లు, డిగ్రీ మూడో సెమిస్టర్, నాలుగో సెమిస్టర్ తెలుగు పాఠ్యాంశాలకు సంబంధించిన నూతన సిలబస్‌ను సభ్యులు సమగ్రంగా చర్చించి రూపొందించారు. అనంతరం రూపొందించిన సిలబస్‌ను బోర్డ్ ఆఫ్ స్టడీస్ సమావేశంలో ప్రవేశపెట్టగా, కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సందర్భంగా బీఓఎస్ చైర్మన్ డా. చిర్ర రాజు మాట్లాడుతూ, నూతన సిలబస్‌ను విద్యార్థుల్లో భాషా నైపుణ్యాలు, సాహిత్య అవగాహన, సృజనాత్మకత, పరిశోధనా దృక్పథం, ఉపాధి సంబంధిత సామర్థ్యాలు పెంపొందే విధంగా రూపొందించినట్లు తెలిపారు. ఆధునిక అవసరాలకు అనుగుణంగా విద్యార్థులకు ప్రయోజనం చేకూరే అంశాలకు ఇందులో ప్రాధాన్యత కల్పించినట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో తెలుగు శాఖాధ్యక్షుడు డా. మామిడి లింగయ్య, బోర్డ్ ఆఫ్ స్టడీస్ సభ్యులు డా. బి. సీతారాం, డా. కె. భారతి, డా. ఎం. వెంకట రమణతో పాటు పాఠ్య ప్రణాళిక సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## పింగళి ప్రభుత్వ మహిళా కళాశాలలో జూనియర్ అసిస్టెంట్ మునావర్‌కు ఘన వీడ్కోలు



**హన్మకొండ, 30 జూన్ 2026 (జై భీమ్ న్యూస్)**

పింగళి ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల (అటానమస్), హనుమకొండలో సుదీర్ఘకాలం జూనియర్ అసిస్టెంట్‌గా సేవలందించిన మునావర్ పదవీ విరమణ చేసిన సందర్భంగా కళాశాల స్టాఫ్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా వీడ్కోలు, సన్మాన కార్యక్రమం నిర్వహించారు.కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ లెఫ్టినెంట్ ప్రొఫెసర్ బి. చంద్రమౌళి అధ్యక్షత వహించి మాట్లాడుతూ, మునావర్ తన ఉద్యోగ జీవితమంతా క్రమశిక్షణ, అంకితభావం, నిజాయితీతో విధులు నిర్వహించి కళాశాల అభివృద్ధికి విశేష సేవలు అందించారని కొనియాడారు. పదవీ విరమణ అనంతరం ఆయన ఆరోగ్యంగా, ఆనందంగా కుటుంబ సభ్యులతో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. మునావర్ తన ఉద్యోగ జీవితంలోని మధుర అనుభవాలను సభలో పంచుకుంటూ, తనతో కలిసి పనిచేసిన అధ్యాపకులు, బోధనేతర సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. విదేశాల్లో ఉన్న ఆయన కుమారులు పంపిన శుభాకాంక్షల సందేశాన్ని అధ్యాపకులు పీడీ సుజాత, రమేశ్ కుమార్ సభలో చదివి వినిపించారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా. జి. సుహాసిని, స్టాఫ్ క్లబ్ కార్యదర్శి డా. ఎం. అరుణ, అధ్యాపకులు పీడీ సుజాత, ఎస్. మధు, ప్రవీణ్ కుమార్, రామకృష్ణారెడ్డి, సారంగపాణి, రమేశ్ కుమార్, రాజేశ్వరి, మాధవి, యుగంధర్ తదితరులు మునావర్ అందించిన సేవలను గుర్తు చేసుకుంటూ ఆయనను అభినందించారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ క్లబ్ సభ్యులు లకన్ సింగ్, రత్నమాల, సుమలత, అధ్యాపకులు కె. శ్రీనివాస్, రాజిరెడ్డి, ప్రశాంతి, ఉదయశ్రీ, రాజు, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది హసీనా, రోహిత్, రాజు, రజిత, శకుంతలతో పాటు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ఢిల్లీ దర్బార్‌కు ఏటీఎంగా తెలంగాణ

**హైదరాబాద్,జూన్ 30(జై భీమ్ న్యూస్):**

కాంగ్రెస్ ఢిల్లీ దర్బార్‌కు తెలంగాణను ఏటీఎంగా మార్చారని భాజపా జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ విమర్శించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అధ్యక్షతన మల్కాజిగిరిలోని ఔషాపూర్ రాక్ ఎంక్లేవ్‌లో జరిగిన భాజపా రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో నితిన్ నబీన్ మాట్లాడారు. మోదీ నేతృత్వంలో భాజపా వెంట నడిచేందుకు తెలంగాణ ప్రజలు సిద్ధంగా ఉన్నారు. భాజపాను గెలిపించిన రాష్ట్రాల్లో ఇచ్చిన హామీలు అమలు చేస్తున్నాం. దేశంలో 12 ఏళ్లలో చాలా పరివర్తన వచ్చింది. కేంద్ర ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి. పశ్చిమబెంగాల్‌లో ఎలా గెలిచారని చాలా మంది నన్ను అడుగుతున్నారు. భాజపా కార్యకర్తల కష్టాలతో పశ్చిమబెంగాల్‌లో గెలిచామని చెప్పాను. అక్కడ పార్టీ కార్యకర్తలను చాలా ఇబ్బందులకు గురిచేశారు. అయినా, లెక్కచేయకుండా భాజపాని గెలిపించాలనే ఆలోచనతో వారు పనిచేశారు. సర్‌పై ప్రజలకు భాజపా కార్యకర్తలు అవగాహన కల్పించాలి. తెలంగాణలో సర్‌పై ప్రజలు సంతోషంగా ఉన్నారు. తెలంగాణలో ఆర్‌ఆర్ ట్యాక్స్ విధిస్తున్నారు. ఇక్కడి నుంచి ఢిల్లీకి డబ్బులు వెళ్తున్నాయి. ఢిల్లీ దర్బార్‌కు తెలంగాణ ఏటీఎంగా మార్చారు. తెలంగాణలో కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు ఇచ్చింది.. కానీ, ఒక్కటికూడా పూర్తి చేయలేదు. కాంగ్రెస్.. అవినీతి, నేరాల తరహా పాలన చేస్తున్నారు. కాంగ్రెస్, ఎంఐఎం, బీఆర్‌ఎస్ కలిసే ఉన్నాయి. రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాలకు ఇంకా అన్యాయం జరుగుతూనే ఉందని నితిన్ నబీన్ ఆరోపించారు. కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు సమావేశంలో పాల్గొన్నారు.

## అనంతలక్ష్మి ప్రభుత్వ ఆయుర్వేద కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ డా. సత్య శారద



**వరంగల్, 30 జూన్ 2026 (జై భీమ్ న్యూస్)**

వరంగల్ జిల్లా కలెక్టర్ డా. సత్య శారద, ఐఏఎస్ మంగళవారం అనంతలక్ష్మి ప్రభుత్వ ఆయుర్వేద కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి కళాశాలలోని మౌలిక సదుపాయాలు, పరిపాలన వ్యవస్థ, విద్యార్థులకు అందిస్తున్న సేవలను పరిశీలించారు. తనిఖీ సందర్భంగా ఇటీవల కూలిపోయిన కళాశాల ప్రహరీ గోడ (కాంపౌండ్ వాల్), కళాశాల భవనం పరిస్థితిని కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. దెబ్బతిన్న ప్రహరీ గోడ, భవనాల మరమ్మతులు, పునర్నిర్మాణానికి సంబంధించిన అంచనా వ్యయ (ఎస్టిమేట్) నివేదికను వెంటనే సిద్ధం చేసి సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే కళాశాలలో ఉన్న అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది ఖాళీలకు సంబంధించిన పూర్తి వివరాలను తక్షణమే అందజేయాలని అధికారులకు సూచించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన సిబ్బందిని భర్తీ చేసే దిశగా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. కళాశాల పరిపాలన, మౌలిక వసతులు, విద్యార్థులకు అందుతున్న విద్యా, వైద్య సేవలపై సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్, కళాశాల ప్రిన్సిపాల్ డా. కె. అనసూయకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వ ఆయుర్వేద కళాశాలలో విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం, సురక్షితమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. కళాశాల అభివృద్ధి పనుల్లో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా సమయానుకూలంగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.

## వరంగల్ భద్రకాళీ అమ్మవారి హుండీ లెక్కింపు.. రూ.85.03 లక్షల ఆదాయం నమోదు



**వరంగల్, 30 జూన్ 2026 (జై భీమ్ న్యూస్)**

వరంగల్ మహానగరంలోని చారిత్రక ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళీ దేవస్థానం హుండీలను మంగళవారం విప్పి లెక్కింపు నిర్వహించగా, మొత్తం రూ.85,03,997 (అక్షరాలా ఎనభై ఐదు లక్షల మూడు వేల తొమ్మిది వందల తొంభై ఏడు రూపాయలు) ఆదాయం సమకూరింది. హుండీ ద్వారా వచ్చిన నగదును యూనియన్ బ్యాంక్ కేఎంసీ బ్రాంచ్‌లో జమ చేసినట్లు దేవస్థానం అధికారులు తెలిపారు. నగదు ఆదాయంతో పాటు విదేశీ కరెన్సీ కూడా గణనీయంగా లభించింది. హుండీల్లో 200 అమెరికా (యూఎస్ఎ) డాలర్లు, 260 కెనడా డాలర్లు, 30 యూఏఈ దిర్హామ్స్, 30 బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ పౌండ్లు, 300 సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఓమన్ కరెన్సీ, 2 సింగపూర్ డాలర్లు లభించాయి. అలాగే భక్తులు సమర్పించిన మిశ్రమ బంగారం, వెండి ఆభరణాలను నిబంధనల ప్రకారం తిరిగి హుండీలో భద్రపరిచారు. హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని దేవాదాయ ధర్మాదాయ శాఖ వరంగల్ ఉప కమిషనర్ కార్యాలయ పర్యవేక్షకులు ఈ. గౌరీశంకర్, దేవస్థానం కార్యనిర్వహణ అధికారి, అసిస్టెంట్ కమిషనర్ రామల సునీత, ప్రధానార్చకులు భద్రకాళి శేషు, లక్ష్మీ శ్రీనివాస సేవా ట్రస్ట్ అధ్యక్షులు జి. కృష్ణారెడ్డి, శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర సేవా సమితి అధ్యక్షులు జి. నవీన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ హుండీ లెక్కింపు కార్యక్రమంలో వివిధ సేవా సంస్థలకు చెందిన సుమారు 200 మంది సభ్యులు, దేవస్థానం సిబ్బంది పాల్గొని లెక్కింపు ప్రక్రియను పారదర్శకంగా, విజయవంతంగా పూర్తి చేశారు.

# పారిశ్రామిక రంగంలో ఏపి ఊహించని ప్రగతి

**స్పేస్, డ్రోన్ సిటీల నుంచి గ్రీన్ హైడ్రోజన్ వరకూ పురోగతి**

**రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్**

**అమరావతి,జూన్ 30(జై భీమ్ న్యూస్) :**


స్పేస్, డ్రోన్ సిటీల నుంచి గ్రీన్ హైడ్రోజన్ వరకూ ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక రంగంలో ఊహించని ప్రగతిని సాధించిందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. గత ఐదేళ్ల పాలనతో పోలిస్తే కూటమి ప్రభుత్వం వచ్చిన ఈ రెండేళ్ల కాలంలో ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక రంగంలో అద్భుతమైన ప్రగతి సాధించిందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ స్పష్టం చేశారు. అమరావతిలో జరిగిన ఒక సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2019 నుంచి 2024 వరకు ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లో పరిశ్రమల సంఖ్య పూర్తిగా పడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పారిశ్రామిక విధానాల్లో తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పుల వల్ల గడిచిన రెండేళ్లలోనే ఏకంగా రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయన్నారు. దేశవ్యాప్తంగా వచ్చిన మొత్తం పెట్టుబడుల్లో కేవలం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమే 24.3 శాతం వాటాను దక్కించుకొని దేశంలోనే అగ్రగామిగా నిలిచిందని మంత్రి గర్వంగా ప్రకటించారు. రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడి ప్రతిపాదనలను వేగంగా కార్యరూపంలోకి తీసుకురావడానికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టిందని మంత్రి టీజీ భరత్ వివరించారు. ఇందులో భాగంగా నిర్వహించిన 18 ఎస్ఐపీబీ సమావేశాల్లోనే దాదాపు రూ.11.77 లక్షల కోట్ల పెట్టుబడు లకు లైన్ క్లియర్ చేస్తూ అనుమతులు మంజూరు చేశామని తెలిపారు. ఈ భారీ ప్రాజెక్టుల ద్వారా రాష్ట్ర యువతకు పది లక్షల ముప్పై రెండు వేల (10.32 లక్షలు) కొత్త ఉద్యోగ అవకాశాలు రానున్నాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. పరిశ్రమల స్థాపనకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పించడంలో భాగంగా ప్రభుత్వం ఇప్పటివరకు వివిధ శాఖల ద్వారా 26 నూతన విధానాలను ప్రకటించగా, అందులో పరిశ్రమల శాఖే స్వయంగా 6 కీలక పాలసీలను తీసుకొచ్చిందని గుర్తుచేశారు. క్వాంటం వ్యాలీ, ప్రతిష్టాత్మక స్టీల్ ఎ÷-లాంట్, స్పేస్, డ్రోన్ సిటీ, గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీతో పాటు సర్క్యులర్ ఎకానమీ పాలసీలపై ప్రభుత్వం పూర్తి స్థాయిలో దృష్టి సారించిందన్నారు.



# అరుదైన బాధ్యతలు డాక్టర్ అనిత రెడ్డికి సొంతం





**సొంత కష్టాన్ని నమ్ముకుని ఉన్నత స్థానానికి చేరారు**
**నిజాయితీగా సమాజం వైపు నిలబడితే ఎంత స్థాయికైనా అర్హులవుతారు**
**ప్రభుత్వ వ్యవస్థలు బాధ్యతగా నడవడానికి ఈ పదవి పూర్తిస్థాయిలో దోహదపడగలదు**
**అవినీతి అక్రమాలను పసిగట్టడంలో డాక్టర్ అనిత రెడ్డి ప్రత్యేకతే వేరు**
**ఎన్ని ఉన్నతమైన అధికారాలు లభిస్తున్న పేదల సేవకు వెన్నంటే ఉంటున్నారు**

**డాక్టర్ అనిత రెడ్డి వివిధ బాధ్యతలతో పాటు ప్రజాసేవను కొనసాగిస్తున్నారు**
**గ్లోబల్ హ్యూమన్ రైట్స్, కరప్షన్ కన్జ్యుమర్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ట్రస్ట్ , తెలంగాణ రాష్ట్ర ఎమినెంట్ హానరరీ ప్యాట్రన్ గా డా. కరుకాల అనితా రెడ్డి**

**హన్మకొండ జై భీమ్ న్యూస్.**

అనురాగ్ హెల్పింగ్ సొసైటీ చైర్మన్ కాకతీయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులు డాక్టర్ అనితా రెడ్డికి గ్లోబల్ హ్యూమన్ రైట్స్ కరప్షన్,కన్జ్యుమర్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ట్రస్ట్ , తెలంగాణ రాష్ట్ర ఎమినెంట్ హానరరీ ప్యాట్రన్ గా డాక్టర్ అనితా రెడ్డి ఎన్నిక కాబడ్డారు, సమాజానికి డాక్టర్ అనితా రెడ్డి అందిస్తున్న సేవలను గుర్తించి ఈ పదవిని అందించామని సంస్థ ఫౌండర్ చైర్మన్ అడ్వకేట్ డాక్టర్ చక్రవర్తి తెలిపారు,మానవ హక్కుల రక్షణ, లంచాలను అరికట్టడంలో డాక్టర్ అనితా రెడ్డి యువతను తీర్చిదిద్దుతున్న తీరు వినియోగదారుడు మోసపోకుండా ఉండేందుకు కల్పిస్తున్న అవగాహన కార్యక్రమాలు చాలా స్ఫూర్తి గా ఉన్నాయని అవి గ్లోబల్ హ్యూమన్ రైట్స్,యాంటీ కార్పషన్ కన్జ్యుమర్ ప్రొటెక్షన్ సంస్థ కు సమాజానికి చాలా ఉపయోగ పడతాయని నమ్మి కీలకమైన పోస్ట్ ను డాక్టర్ అనితా రెడ్డికి ఇవ్వడం జరిగిందని డాక్టర్ చక్రవర్తి అన్నారు,డాక్టర్ అనితా రెడ్డి మాట్లాడుతూ ఈ పదవి రావడం చాలా సంతోషంగా ఉందని, బాధ్యత మరింత పెరిగిందని మానవ హక్కుల రక్షణ, లంచాలను అరికట్టడం లో భారత దేశం ఇతర దేశాలతో పోలిస్తే చాలా వెనక పడ్డమాట వాస్తవం,ఎందుకంటే ఎవరి విధులు వారు సక్రమంగా నిర్వహిస్తే ఈరోజు మనం ముందు వరసలో ఉండేవారం. ముఖ్యంగా వెనక పడ్డటానికి కారణం మానవ హక్కులకు రక్షణ లేక పోవడం, విపరీతంగా లంచాలు తీసుకోవడం పెరగడం, వినియోగ దారుడు మోసపోవడం, ఇవి ముఖ్య కారణం ,మన దేశంలో ఎవరు ఏమి చేస్తారు నేను ఏది చేసినా చెల్లుతుంది అనే ధైర్యం, దీనికి తోడు తప్పు చేసిన వారికి సరైన శిక్ష పడకపోవడం కారణంగా వెనక పడ్డది.ప్రతి ఒక్కరికీ బాధ్యత,హుందాతనం క్రమశిక్షణ ఉండాలి అనే ఉద్దేశంతో యువతను తీర్చిదిద్దడం, న్యాయము వైపు పోరాడడం వంటి కార్యక్రమాలు చేస్తానని ,పదవులు రావడం గొప్ప కాదని ఆ పదవికి వన్నె తెచ్చేలా పనిచేయగలగాలని నమ్మే వ్యక్తిని నేను పనిచేసి చూపిస్తానని డాక్టర్ అనితా రెడ్డి అన్నారు. - డాక్టర్ అనితా రెడ్డి, అనురాగ్ సొసైటీ చైర్మన్.

# తెలంగాణ రైతుల ఖాతాల్లో భరోసా నిధులు

**శిల్పకళావేదికగా రైతుభరోసా నిధులు విడుదల**
**44.28 లక్షల మంది రైతులఖాతాల్లో రూ.2,482 కోట్ల జమ**
**మంత్రులతో కలసి నిధులను విడుదల చేసిన సిఎం రేవంత్**

**హైదరాబాద్,జూన్ 30(జై భీమ్ న్యూస్):**

తెలంగాణలో రైతు భరోసా నిధులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విడుదల చేశారు. తొలి విడతలో రెండు ఎకరాల లోపు భూమి కలిగిన 44.28 లక్షల మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.2,482 కోట్లను నేరుగా జమ చేసినట్లు సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. శిల్పకళా వేదికగా డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావులతో కలసి నిధులను విడుదల చేశారు. రైతుల పెట్టుబడి భారం తగ్గించి, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని సీఎం రేవంత్ పేర్కొన్నారు. 30 నెలల ప్రజాపాలనలో రైతు తలెత్తుకునేలా పాలన అందిస్తున్నామని అన్నారు. వ్యవసాయం దండగ కాదని, పండుగగా భావించే పరిస్థితిని ప్రభుత్వం కల్పిస్తోందని పేర్కొన్నారు. తెలంగాణ ఏర్పడే సమయానికి రాష్ట్ర అప్పు రూ.69 వేల కోట్లు ఉండగా, 2023 నాటికి అది రూ.8.11 లక్షల కోట్లకు చేరిందని అన్నారు. గత పదేళ్లలో దాదాపు రూ.7 లక్షల కోట్ల అప్పు చేసి ధనిక రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. కల్వకుంట్ల కుటుంబం చేసిన అప్పులు, తప్పుల భారం ఇప్పుడు తమ ప్రభుత్వం భరిస్తోందని రేవంత్ రెడ్డి అన్నారు. 'బకాయిలు పెట్టింది బకాసురుడు... కట్టే పాపం మాకా?' అంటూ గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగులకు వాయిదాల పద్ధతిలో జీతాలు చెల్లించే పరిస్థితి నెలకొందని, ధనిక రాష్ట్రమంటూ గొప్పలు చెప్పి, ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితికి తీసుకెళ్లారని విమర్శించారు. ఢిల్లీ నుంచి గల్లీ వరకు తెలంగాణ పరువు తీశారని విమర్శించారు. ప్రస్తుతం ప్రజాపాలనలో ప్రతి నెల ఒకటో తేదీనే ఉద్యోగులకు వేతనాలు చెల్లిస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు రైతు భరోసా పథకం కింద రూ.36 వేల కోట్లు రైతులకు అందించినట్లు సీఎం వెల్లడించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఉచిత విద్యుత్ నిలిపివేస్తారనే దుష్ప్రచారం చేశారని, కానీ 2004లో రైతులకు ఉచిత విద్యుత్‌ను తీసుకొచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని గుర్తు చేశారు. రైతుల కోసం ప్రతి నెల సుమారు రూ.6 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. ఉచిత విద్యుత్ కోసం రూ.30 వేల కోట్లు, రైతు బీమా కోసం రూ.4 వేల కోట్లు, రైతుల నుంచి ధాన్యం కొనుగోలు కోసం రూ.80 వేల కోట్లు వ్యయం చేసినట్లు సీఎం రేవంత్ వివరించారు.

# కేంద్రమంత్రి బండికి ఊరట

**హుజూరాబాద్ ఉప ఎన్నికల కేసు కొట్టివేత**

**హైదరాబాద్,జూన్ 30(జై భీమ్ న్యూస్):**

హుజూరాబాద్ ఉప ఎన్నికల సమయంలో నమోదైన కేసులో కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు ఊరట లభించింది. ఈ కేసును విచారించిన నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టు బండి సంజయ్‌పై నమోదైన కేసును కొట్టివేసింది. హుజూరాబాద్ ఉప ఎన్నికల సందర్భంగా అప్పటి అధికార బీఆర్ఎస్ పార్టీ ఓటుకు రూ.25 వేల వరకు ఇస్తోందని బండి సంజయ్ ఆరోపించారు. అలాగే ఓటర్లకు రూ.5 వేల చొప్పున ఇచ్చి, మిగిలిన మొత్తాన్ని బీఆర్ఎస్ కార్యకర్తలు పంచుకుంటున్నారని కూడా ఆయన వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యల నేపథ్యంలో హుజూరాబాద్ పోలీసులు బండి సంజయ్‌పై ఐపీసీ సెక్షన్లు 188, 171సీ, 505(2)తో పాటు ప్రజాప్రాతినిధ్య చట్టం-1951లోని సెక్షన్ 123(3ఏ) కింద కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో కేసును విచారించిన నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టు కేసును కొట్టివేస్తూ తీర్పు వెలువరించింది.

# పదవి ఎవ్వరికీ శాశ్వతం కాదు



**ఎన్టీఆర్, ఇందిర లాంటి వారే ఓడారు**
**పదవి శాశ్వతం అని నేను కూడా భావించడం లేదు**
**ఇచ్చిన హామీ మేరకు మంచి పనులు చేయడమే నా లక్ష్యం**
**రాష్ట్రాన్ని అప్పల బారి నుంచి గాడిన పెడుతున్నాం**
**రైతులను రుణమాఫీ, రైతు భరోసాతో ఆదుకుంటున్నాం**
**బకాసురుడు కెసిఆర్ చేసిన అప్పలు తీర్చలేక చస్తున్నాం**
**కెసిఆర్ హాయంలో జీతాలు కూడా సక్కగ ఇవ్వలేదు**
**కన్నకూతరు ఫోన్లు కూడా ట్యాప్ చేసిన ఘనుడు**
**మళ్ళీ వస్తే ఫోన్ ట్యాపింగ్ తప్ప మరేమీ ఉండదు**
**రాష్ట్రంలో బిజెపి అధికారంలోకి వచ్చే ఛాన్స్ లేదు**
**శిల్పకళావేదిక సభలో సిఎం రేవంత్ విమర్శలు**

**హైదరాబాద్,జూన్ 30(జై భీమ్ న్యూస్) :**

పదవి ఎవరికీ శాశ్వతం కాదని, కేవలం ఇచ్చిన మాటే శాశ్వతంగా ఉంటుందని.. నాడు ఇందిరమ్మ, ఎన్టీఆర్ లాంటి మహానాయకులే ఓడిపోయారని సిఎం రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. నాకు కూడా అంతేనని, పదవి శాశ్వతంగా ఉంటుందని నేను కూడా భావించడం లేదన్నారు. అయితే ఉన్నన్ని నాళ్లు మంచి పనులు చేసి, మంచివాడనిపించుకోవడమే ముఖ్యమని అన్నారు. నేను అబద్దాలు చెప్పను, చెప్పింది చేసి తీరుతా. ప్రజలకు నచ్చకపోయినా ఉన్నది ఉన్నట్లే చెప్తాను అని స్పష్టం చేశారు. ఈ ప్రభుత్వం ప్రజలది, రైతులది, ఆడబిడ్డలది అని భరోసా ఇచ్చారు. కేసీఆర్ లాంటి తప్పుడు పనులు తాను ఎప్పటికీ చేయనని చెప్తూ.. ఆ పశుపతిని (కేసీఆర్‌ను) నీ ఫార్మ్‌హౌస్‌లోనే బంధించాను, ఇక బయటకు రానిచ్చే ప్రసక్తే లేదు‘ అని సీఎం రేవంత్ రెడ్డి తేల్చిచెప్పారు. శిల్పకళావేదిక వేదికగా జరిగిన రైతు భరోసా నిధుల విడుదల కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విపక్షాలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గత పాలకుల తీరును ఎండగడుతూ పదునైన వ్యాఖ్యలు చేశారు. ప్రజలు బకాసురుడిని తీసుకెళ్లి ఫార్మ్‌హౌస్‌లో కూర్చోబెట్టారని కేసీఆర్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఆయన అన్నీ మీకే చేశాడని, మళ్లీ అధికారంలోకి రావాలని అంటున్నాడు. అసలు మనకేం చేశాడు? మళ్లీ ఎందుకు వస్తాడు అని సీఎం ప్రశ్నించారు. గత పదేళ్లలో అగ్రికల్చర్, హార్టికల్చర్‌లను పూర్తిగా పక్కనపెట్టేసి, రాష్ట్రంలో 'డ్రింకింగ్ కల్చర్' తీసుకువచ్చారని మండిపడ్డారు. బకాసు9రుడు చేసిన అప్పులను మేము తీరుస్తున్నామని అన్నారు. మళ్లోసారి కేసీఆర్ వస్తే భార్యాభర్తల మాటలను వినడం తప్ప చేసేదేమీ లేదన్నారు. కన్న బిడ్డ కవిత, అల్లుడు మాట్లాడుకున్న మాటలు విన్నారని ఫోన్ ట్యాపింగ్‌పై రేవంత్ ఘాటు విమర్శలు చేశారు. 30 నెలల్లో రైతు సంక్షేమం కోసం అనేక పనులు చేశామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. 19 మంది ముఖ్యమంత్రులు రాష్ట్రానికి రూ.69 వేల కోట్లు అప్పు చేశారని, 2014 నాడు రాష్ట్రం ఏర్పడినప్పుడు రాష్ట్రానికి రూ.69 వేల కోట్లే అప్పు ఉందని సీఎం గుర్తుచేశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రూ.8 లక్షల 11 వేల కోట్ల అప్పు అయిందని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. కేవలం కల్వకుంట్ల కుటుంబం ఏడు లక్షల కోట్లకు పైగా అప్పు చేసిందని సీఎం చెప్పారు. రాష్ట్రం ఏర్పడిన టైంలో మిగులు బడ్జెట్ ఉండేదని, రాష్ట్రం కోలుకోకుండా కేసీఆర్ అప్పులు చేశారని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. అప్పులు కాదు.. అందిన కాడ చేబదులు కేసీఆర్ తీసుకొచ్చారని.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చే నాటికి ఉద్యోగులకు జీతాలు వాయిదాల్లో ఇచ్చారని బీఆర్ఎస్ పాలనను సీఎం రేవంత్ దుయ్యబట్టారు. ధనిక రాష్ట్రంలో జీతాలు ఇవ్వలేని స్థితికి కేసీఆర్ తీసుకెళ్లారని సీఎం రేవంత్ విమర్శించారు. కాంట్రాక్టర్లు, సర్పంచులకు బకాయిలను కేసీఆర్ ఇవ్వలేదని, కేసీఆర్ సర్కార్ వల్లే మాజీ సర్పంచులు ఆత్మహత్యలు చేసుకున్నారని సీఎం ఆరోపించారు. బకాయిలు బకాసురుడు పెడితే.. కట్టే పాపం తనపై పడిందని సీఎం రేవంత్ చెప్పుకొచ్చారు. స్కూల్లోని పిల్లలకు మిడ్ డే మీల్స్ పెట్టేవాళ్లకు బకాయిలు పెట్టారని.. బీఆర్ఎస్ సర్కార్ అప్పులే కాదు.. తప్పులు కూడా చేసిందని సీఎం విమర్శించారు. దేశంలో ఎక్కడికి పోయినా ఇజ్జత్ పోయేలా కేసీఆర్ చేశారని, చంద్రశేఖర్ దెబ్బకు రాష్ట్రంలోని ప్రజలంతా బికారులయ్యామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. తవ్వుతున్న కొద్దీ.. గుట్టల కొద్దీ అప్పులు బయటపడ్డాయని.. బీఆర్ఎస్ హయాంలో కట్టిన కాళేశ్వరం కూలేశ్వరం అయిందని సీఎం రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. ఇదే వేదికపై నుంచి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై, ప్రధాని మోదీపై కూడా రేవంత్ రెడ్డి విమర్శనాస్త్రాలు సంధించారు. దేశంలో రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తానని చెప్పిన మోదీ, ఆ ఉద్యోగాలు ఎవరికిచ్చారని నిలదీశారు. ఇక్కడ ఇద్దరికే ఉద్యోగాలు వచ్చాయని, వారు కిషన్ రెడ్డి, బండి సంజయ్ అని ఎద్దేవా చేశారు. ‘అక్కడ పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ కాబట్టి మీ పప్పులు ఉడికాయి. బెంగాల్‌లో గెలవడానికి మీకు 15 ఏళ్లు పట్టింది. కానీ ఇక్కడికి మీరా వచ్చేది? ఇక్కడ మావాళ్లు ఉన్నారు, దంచి కొడతారు‘ అంటూ తెలంగాణలో బీజేపీ ఆటలు సాగవని హెచ్చరించారు. బీఆర్ఎస్ నేతలు ప్రభుత్వంపై చేస్తున్న వ్యాఖ్యలకు రేవంత్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. ‘దిగిపోవడానికి ఇది నీ అయ్యా జాగీరా? మేము మీకేం బానిసలం కాదు‘ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాడు రైతులను వరి వేసుకుంటే ఉరే అన్న కేసీఆర్, ఆయన మాత్రం ఫార్మ్‌హౌస్‌లో వడ్లు పండించి ఏకంగా 4200 క్వింటాళ్లు అమ్ముకున్నాడని ఆరోపించారు. రూ.లక్ష కోట్లతో కట్టిన కాళేశ్వరం కూలినా.. ఇవాళ వరిసాగులో తెలంగాణ నంబర్ వన్‌గా నిలిచిందన్నారు. బోరు కింద పంటలు పండినా కాళేశ్వరం మహిమ అంటూ ప్రజలను మోసం చేశారని చెప్పారు. కేసీఆర్ ఒక్కసారైనా రైతు రుణమాఫీని పూర్తి చేశారా? దళితులకు మూడెకరాల భూమి ఇచ్చారా? ప్రజలకు ఏం చేశారని కేసీఆర్ మళ్లీ రావాలని అనుకుంటారు? పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, ఇంటికో ఉద్యోగం ఇచ్చారా? ఊరూరికి బెల్ట్ షాప్ తెచ్చి తాగుడు కల్చర్ నేర్పించారు. కేసీఆర్ మళ్లీ అధికారంలోకి వస్తే చేసేదేమీ ఉండదు. వరి వేస్తే ఉరే అని బెదిరించి రైతుల పంటను కొనలేదు. పేదల ఖాతాల్లో రూ.15లక్షలు వేస్తామని మోదీ అన్నారు.. వేశారా?ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ఆయన చెప్పారు.. ఇచ్చారా? అని ప్రశ్నించారు. నష్టాల్లో ఉన్న ఆర్టీసీని లాభాల్లోకి తీసుకొచ్చాం. మహిళలకు ఉచిత ప్రయాణం ఇస్తున్నామని ఆటో డ్రైవర్లను రెచ్చగొట్టారు. మహిళలతో ఆర్టీసీ బస్సులు కొనుగోలు చేయించి యజమానులుగా చేశాం. రెండేళ్లలోనే 70 వేల ఉద్యోగాలు భర్తీ చేశాం అన్నారు. ఎల్‌నినో ప్రభావం వల్ల ఈసారి తక్కువ వర్షాలు పడ్డాయి. రైతుల వరిసాగు తగ్గించి మెట్ట పంటలు వేసుకోవాలి. వ్యవసాయం అంటే దండగ కాదు.. పండగ అనుకునేలా చేస్తున్నాం. 9 రోజుల్లో రైతుల ఖాతాల్లో రూ.9వేల కోట్లు వేస్తాం. ఒక్కో సమస్యను చక్కబెట్టుకుంటూ సంక్షేమం కొనసాగిస్తున్నాం. సాగు పనులు మొదలయ్యే నాటికే రైతుభరోసా అందిస్తున్నాం. 2023లో సీఎస్ వంటి ఐఏఎస్ అధికారులకే 1న జీతాలు ఇవ్వలేని పరిస్థితి. కొన్నేళ్లుగా వాయిదాల పద్ధతిలో వస్తున్నాయని అధికారులు చెప్పారు. బడి పిల్లల తిండి బిల్లులు కూడా రూ.వేల కోట్ల బకాయిలు పెట్టారు. సర్పంచ్‌ల బిల్లులు రూ.వేలకోట్లు పెండింగ్ పెడితే.. వారు ఇప్పుడు ధర్నాలు చేశారు. బిల్లులు పెండింగ్ పెట్టింది కేసీఆర్.. ఆ బద్నాం మోసింది నేను. కేసీఆర్ చేసిన అప్పులతో దిల్లీలో కూడా పరువు పోయే పరిస్థితి వచ్చింది‘ అని రేవంత్ అన్నారు.



జై భీమ్
తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా
Jai Bheem TV
STRUGGLE FOR JUSTICE
సామాన్యుడి ఆయుధంగా

# అడుగడుగునా రైతులకు కాంగ్రెస్ మోసం




**పాలమూరు పరువు తీసేలా రేవంత్ వ్యవహారం**
**బోనస్ హామీలు బోగస్‌గా మారాయి**
**జడ్చర్ల సభలో మాజీమంత్రి హరీష్ రావు విమర్శలు**

**మహబూబ్‌నగర్,జూన్ 30(జై భీమ్ న్యూస్):**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి అడుగడుగునా రైతులను మోసం చేస్తూనే ఉందని మాజీ మంత్రి హరీష్ రావు మండిపడ్డారు. ముఖ్యమంత్రి ప్రవర్తన, ఆయన మాట్లాడే తీరు పాలమూరు జిల్లా పరువు తీసేలా ఉందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇవాళ నిర్వహిస్తున్నది ఆశీర్వాద సభ కాదని, అది ముమ్మాటికీ రైతు వంచన సభేనని మాజీ మంత్రి హరీష్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. జడ్చర్లలో నిర్వహించిన ఎస్ఐఆర్ అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వివిధ సమయాల్లో రేవంత్ రెడ్డి మాట్లాడిన వీడియో క్లిప్పింగులను సభలో ప్రదర్శించిన హరీష్ రావు.. సీఎం అనుచిత వ్యాఖ్యల వల్ల ముఖ్యమంత్రి కుర్చీ విలువ కూడా పూర్తిగా తగ్గిపోయిందని ఎద్దేవా చేశారు. గత ఎన్నికల సమయంలో కేసీఆర్ ఎలాంటి హామీలు ఇవ్వకపోయినా, ప్రజలకు ఏం కావాలో ముందే గుర్తించి పనులు చేసేవారని హరీష్ రావు గుర్తుచేశారు. కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతాంగానికి ఇచ్చిన బోనస్ హామీ అంతా ఒక బోగస్ వ్యవహారంగా మారిపోయిందని విమర్శించారు. రాష్ట్రంలో ఎరువుల ధరలు విపరీతంగా పెరిగాయని, మార్కెట్లలో తరుగు పేరుతో నిరుపేద రైతులను దారుణంగా దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. చివరకు రైతులకు సకాలంలో యూరియా ఇవ్వడంలో కూడా ఈ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. షాపుల్లో అసలు యూరియా స్టాక్ ఉంచడం లేదు కాబట్టే.. ఆ నిజాన్ని కప్పిపుచ్చుకోవడానికి యాప్ లంటూ కొత్త కథలు మొదలుపెట్టారని దుయ్యబట్టారు. ఇదే క్రమంలో మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన మంత్రి జూపల్లి కృష్ణారావు తీరుపై కూడా హరీష్ రావు చమత్కరించారు. జిల్లా మంత్రిగా ఉన్న జూపల్లి అసలు ఏం మాట్లాడుతాడో, ఎందుకు మాట్లాడుతాడో ఆయనకే అర్థం కాదంటూ ఎద్దేవా చేశారు. రైతుల సమస్యలను పట్టించుకోవడంలో జిల్లా మంత్రులు, ప్రభుత్వం పూర్తిగా విఫలమయ్యారని, కాంగ్రెస్ మార్క్ మోసపూరిత పాలనపై రైతాంగం తిరగబడే రోజులు దగ్గరపడ్డాయని హరీష్ రావు హెచ్చరించారు. జడ్చర్ల నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాజీ మంత్రి హరీశ్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి ఇవాళ హైదరాబాద్‌లో రైతుల ఆశీర్వాద సభ మీటింగ్ పెట్టిండు. నా దృష్టిలో రైతులను అడుగడుగున వంచించినవ్ కదా.. అది రైతు ఆశీర్వాద సభ కాదు.. రైతు వంచన సభ అని పెట్టుకో అని రేవంత్ రెడ్డికి హితవు పలికారు. ఎన్నికల ముందు ఎకరానికి రూ.15 వేలు రైతు బంధు ఇస్తామని హామీనిచ్చిర్రు.. కానీ ఇచ్చిందెంత రూ.12 వేలు.. అవి కూడా ఒక పంట మొత్తానికే 9వేలు ఎగ్గొట్టిండు. ఒక పంట 3 ఎకరాలే ఇచ్చాడు. ఇంకో పంట 2 ఎకరాల వరకే ఇచ్చాడు.. వాళ్లిచ్చిన ప్రకారం లెక్క తీస్తే ఇవాళ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు బంధుపై రూ.29300 కోట్లు రైతు బంధు పేరిట రైతులకు బాకీ పడిందన్నారు హరీశ్ రావు జడ్చర్ల సభ నుంచి అడుగుతున్నా రేవంత్ రెడ్డి నువ్వు పెట్టుకున్న ఈ రైతు వంచన సభలో రూ.29300 కోట్లు ఎప్పటిలోపు ఇస్తావో తెలంగాణ రైతాంగానికి చెప్పాలని డిమాండ్ చేస్తున్నానన్నారు హరీశ్ రావు. ఈ బాకీ బడ్డ రైతు బంధు డబ్బులు ఎన్ని రోజుల్లోగా తిరిగిస్తావో చెప్పలని తెలంగాణ రైతుల పక్షాన, బీఆర్ఎస్ పార్టీ పక్షాన నేను రేవంత్ రెడ్డిని అడుగుతున్నానన్నారు.

## విజయవాడ హైవేపై ప్రమాదం

**నల్లగొండ,జూన్ 30(జై భీమ్ న్యూస్) :**

నల్గొండ జిల్లా కట్టంగూర్ మండలం ముత్యాలమ్మగూడెం వద్ద విజయవాడ -హైదరాబాద్ జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం జరిగింది. ప్రైవేటు ట్రావెల్స్ బస్సు సిమెంట్ లారీ ట్యాంకర్‌ను ఢీకొట్టింది. ట్రావెల్స్ బస్సు భీమవరం నుంచి హైదరాబాద్ వస్తుండగా టైరు పేలడంతో అవతలివైపు వస్తున్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్, లారీ డ్రైవర్లకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఘటనపై కట్టంగూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## స్కూలు బస్సుపై కూలిన చెట్టు

**11 ఏళ్ల బాలుడు మృతి..పలువురికి గాయాలు**

**ముంబై,జూన్ 30(జై భీమ్ న్యూస్) :**

ముంబై నగరంలో విషాదం చోటుచేసుకుంది. ఓ పెద్ద చెట్టు స్కూల్ బస్సుపై కూలిపడిన ఘటనలో ఓ బాలుడు మృతి చెందాడు. మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. మంగళవారం మధ్యాహ్నం ఈ సంఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మంగళవారం మధ్యాహ్నం ఓ స్కూల్ బస్సు చెంబూర్ రోడ్ నంబర్ 11లో వెళుతుండగా పెద్ద చెట్టు కూలి బస్సుపై పడింది. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 13 మంది విద్యార్థులు ఉన్నారు. చెట్టు బస్సుపై పడగానే బస్ కండక్టర్, స్థానికులు వేగంగా స్పందించారు. ధ్వంసం అయిన బస్సు నుంచి పిల్లలను బయటకు తీసుకువచ్చారు. గాయపడ్డ ఐదుగురిని చెన్ ఆస్పత్రికి తరలించారు. ఈ నేపథ్యంలోనే పోలీసులకు, ముంబై ÷ర్ బ్రిగేడ్‌కు సమాచారం వెళ్లింది. పోలీసులు, ÷ర్ సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సహాయక చర్యలు మొదలెట్టారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ 11 ఏళ్ల విహాన్ శ్రీవాస్తవ్ అనే బాలుడు జెన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశాడు. మిగిలిన ఐదుగురి పరిస్థితి నిలకడగా ఉందని ఆస్పత్రి వైద్యులు తెలిపారు. ఘటన గురించి తెలియగానే ముంబై మేయర్ రీతూ తావ్‌డే జెన్ ఆస్పత్రికి వెళ్లారు. బాధితులను, వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా రీతూ తావ్‌డే మాట్లాడుతూ.. 'ఈ సంఘటన ఎంతో బాధాకరం. నేనో తల్లిగా ఇక్కడికి వచ్చాను. పిల్లల తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగిపోయారు. ఆ స్కూల్ బస్సులో ప్రమాదం జరిగినపుడు 13 మంది ఉన్నారు. వారిలో 12 మంది క్షేమంగా బయటపడ్డారు. ఓ బాలుడు మృతి చెందాడు' అని తెలిపారు.

## అసోంలో భారీ ఆపరేషన్

**అక్రమంగా తరలిస్తున్న 37 కిలోల బంగారం స్వాధీనం**

**గౌహతి,జూన్ 30(జై భీమ్ న్యూస్) :**

అస్సాం పోలీసులు భారీ ఆపరేషన్ చేపట్టారు. అర్ధరాత్రి అక్రమంగా తరలిస్తున్న 37 కిలోల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ దాదాపు రూ.55 కోట్లకు పైనే ఉంటుందని పోలీసులు వెల్లడించారు. బహుశా అస్సాం పోలీస్ చరిత్రలోనే ఇంతపెద్ద మొత్తంలో బంగారం సీజ్ చేసిన ఘటన ఇదే కావొచ్చని డీసీపీ శాంభవి మిశ్రా తెలిపారు. గువాహటిలో అక్షయ్ బన్సోడే (32) అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు వెల్లడించారు. బంగారం అక్రమ రవాణాపై నిఘా వర్గాల నుంచి సమాచారం అందడంతో ఈ ఆపరేషన్ చేపట్టాం. 24 క్యారెట్ల బంగారు కడ్డీలతో పాటు దాదాపు 13 గ్రాముల బరువు ఉన్న వెండి ముక్కలు స్వాధీనం చేసుకున్నాం అని ఆమె తెలిపారు. ఈ ముఠాకు అంతర్జాతీయ గోల్డ్ స్మగ్లింగ్ ముఠాతో సంబంధం ఉన్నట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. ఇదొక భారీ అంతర్జాతీయ స్మగ్లింగ్ ముఠాకు సంబంధించినదిగా తెలుస్తోందని పోలీసులు తెలిపారు. బన్సోడే గతంలో మూడుసార్లు 20 కిలోల బంగారాన్ని అక్రమంగా తరలించాడని, తాజాగా నాలుగోసారి తరలిస్తుండగా పట్టుబడినట్లు పేర్కొన్నారు.

## ఐపిఎస్ అధికారి సునీల్‌కు క్యాట్లోఓ చుక్కెదురు

**సస్పెన్షన్ ఎత్తేయాలన్న పిటిషన్ కొట్టివేత**

**న్యూఢిల్లీ,జూన్ 30(జై భీమ్ న్యూస్) :**

ఏపీకి చెందిన సీనియర్ ఐపీఎస్ అధికారి పీవీ సునీల్‌కుమార్ కు సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రైబ్యునల్ (క్యాట్)లో చుక్కెదురైంది. తనపై రాష్ట్ర ప్రభుత్వం విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేయాలంటూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను క్యాట్ కొట్టివేసింది. తీవ్ర అవినీతి ఆరోపణలతో సస్పెన్షన్‌లో ఉన్న సునీల్‌కుమార్ నేడు సర్వీస్ నుంచి రిలీవ్ అయ్యేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఈరోజైనా తనకు రిలీఫ్ ఇవ్వాలని సునీల్ కుమార్ క్యాట్‌ను కోరారు. మంగళవారం ఉదయం జరిగిన విచారణలో సునీల్ వాదనలు విన్న క్యాట్.. సస్పెన్షన్ రద్దు చేయాలన్న అభ్యర్థనను తోసిపుచ్చింది. సునీల్ కుమార్‌పై పెండింగ్‌లో ఉన్న క్రమశిక్షణ, నేర విచారణలకు ఎలాంటి మినహాయింపులు లేవని, అవి కొనసాగుతాయని మంగళవారం జారీ చేసిన ఉత్తర్వుల్లో రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఆయనకు లభించాల్సిన పెన్షన్ ప్రయోజనాలు అఖిల భారత సర్వీసుల నియమాల ప్రకారం కేంద్ర ప్రభుత్వం జారీ చేసే ఆదేశాలకు లోబడి ఉంటాయని పేర్కొంది.

## తిరుపతిలో ఎలుగుబంటి ప్రత్యక్షం

**వన్యప్రాణుల రాకతో స్థానికుల్లో భయం**

తిరుపతి,జూన్ 30(జై భీమ్ న్యూస్): తిరుపతిలో ఓ ఎలుగుబంటి తన పిల్లలతో తిరగడం తీవ్ర కలకలం రేపింది. ఇటీవల అధ్యాత్మిక క్షేత్రం తిరుపతి నగర సరిహద్దు ప్రాంతాల్లో వన్యప్రాణుల సంచారం స్థానిక ప్రజలను తీవ్ర భయాందోళనలకు గురిచేస్తోంది. తాజాగా తిరుమల నగర్ తెలుగు గంగ వాటర్ హౌస్ పైభాగంలో ఓ ఎలుగుబంటి పిల్లలతో తిరగడం కలకలం సృష్టించింది. ఎలుగుబంటి తన మూడు పిల్లలతో కలిసి ఈ ప్రాంతంలో స్వేచ్ఛగా సంచరిస్తూ స్థానికుల కంటపడింది. నివాస ప్రాంతాలకు అత్యంత సమీపంలో, ఎలుగుబంటి తిరుగుతుండటంతో ఏం జరుగుతుందోనని కాలనీవాసులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. ఈ విషయాన్ని గమనించిన వెంటనే స్థానికులు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. కొంత కాలంగా శేషచల కొండల అంచున ఉండే తిరుమల నగర్, బీటీఆర్ కాలనీ, కృష్ణవేణి యాదవ్ కాలనీ తదితర పరిసర ప్రాంతాలలో రెండు నెలలుగా ఎలుగుబంట్లు తరచూ కనిపిస్తూనే ఉన్నాయి. ఆహారం, నీటి కోసమే ఇవి అడవి దాటి జనావాసాల్లోకి వస్తున్నాయని స్థానికులు భావిస్తున్నారు. ఎలుగుబంట్ల గుంపు కాలనీ వీధుల్లోకి వస్తే ప్రాణనష్టం జరిగే ప్రమాదం ఉందని, రాత్రి వేళల్లో ఇళ్ల నుంచి బయటకు రావడానికే భయపడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నగరవాసులను కేవలం ఎలుగుబంట్లు మాత్రమే కాదు, క్రూర జంతువైన చిరుత పులి కూడా వణికిస్తోంది. కేవలం రెండు వారాల క్రితమే తిరుమల నగర్‌కు సమీపంలోని ఉపాధ్యాయనగర్ వద్ద ఒక చిరుత పులి సంచరిస్తూ స్థానికుల కంట పడింది. వరుసగా చిరుతలు, ఎలుగుబంట్లు నగరంలోకి ప్రవేశిస్తుండటంతో అటవీ సరిహద్దు ప్రాంతాల ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

## ప్రపంచ ఏరోస్పేస్ రాజధానిగా తెలంగాణ

**హైదరాబాద్ నుంచే ప్రపంచ విమానయాన భవిష్యత్‌కు దిశానిర్దేశం**
**గ్లోబల్ ఏరోస్పేస్ దిగ్గజాలకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆహ్వానం**
**వరంగల్, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుల పనులు త్వరలో ప్రారంభం...**
**కొత్తగూడెం విమానాశ్రయానికి త్వరలో గ్రీన్ సిగ్నల్**
**అత్యాధునిక యుద్ధ విమానాల్లో 'మేడ్ ఇన్ తెలంగాణ'**
**మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి**

**హైదరాబాద్,జూన్ 30(జై భీమ్ న్యూస్):**

ప్రపంచ ఏరోస్పేస్ పరిశ్రమకు తెలంగాణ కొత్త కేంద్రంగా అవతరిస్తోందని, ఇకపై అత్యాధునిక విమానాలు, యుద్ధ విమానాలు, హెలికాప్టర్లు, రక్షణ వ్యవస్థల తయారీలో హైదరాబాద్ ప్రపంచ పటంలో అగ్రస్థానంలో నిలవబోతోందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. హైదరాబాద్‌లో జరిగిన ఏరోమార్ట్ హైదరాబాద్-2026 అంతర్జాతీయ ఏరోస్పేస్ / డిఫెన్స్ బిజినెస్ కన్వెన్షన్ ప్రారంభోత్సవంలో మంత్రి మాట్లాడుతూ, 'ప్రపంచ ఏరోస్పేస్ రంగం ఇప్పుడు తెలంగాణ వైపు చూస్తోంది. పెట్టుబడులు, పరిశ్రమలు, అత్యాధునిక సాంకేతికతకు తెలంగాణేశి కొత్త చిరునామా' అని స్పష్టం చేశారు. భారత వైమానిక దళంలో ÷టైర్ పైలట్‌గా పనిచేసిన అనుభవాన్ని గుర్తు చేసుకుంటూ, సూపర్‌సోనిక్ యుద్ధ విమానాలను నడిపిన వ్యక్తిగా ఏరోస్పేస్ రంగంలో నాణ్యత, ఖచ్చితత్వం ఎంత కీలకమో తనకు ప్రత్యక్ష అనుభవం ఉందన్నారు. 'ఒక్క చిన్న విడిభాగం లోపం కూడా మిషన్ విజయాన్ని ప్రభావితం చేస్తుంది. అలాంటి అత్యున్నత ప్రమాణాలను తెలంగాణ పరిశ్రమలు నేడు విజయవంతంగా అందిస్తున్నాయి' అని చెప్పారు. అమెరికా అధ్యక్షుడి హెలికాప్టర్‌కు అవసరమైన క్యాబిన్లు, అపాచీ యుద్ధ హెలికాప్టర్ల నిర్మాణ భాగాలు, ఎఫ్?16 యుద్ధ విమానాల రెక్కలు, ప్రపంచ ప్రఖ్యాత ఏరో ఇంజిన్ విడిభాగాలు, ఎంఆర్‌ఓ వ్యవస్థలు నేడు తెలంగాణలోనే తయారవుతున్నాయని మంత్రి తెలిపారు. 'మేడ్ ఇన్ తెలంగాణ' అనే ముద్ర ఇప్పుడు ప్రపంచ ఆకాశంలో గర్వంగా ఎగురుతోంది' అని పేర్కొన్నారు. స్పెయిన్, కెనడాలకు చెందిన అంతర్జాతీయ దిగ్గజాలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టడం రాష్ట్ర పారిశ్రామిక విశ్వసనీయతకు నిదర్శనమన్నారు.

ఫ్రాన్స్, ఇటలీ సహా 25కిపైగా దేశాల కంపెనీలు ఏరోమార్ట్‌లో పాల్గొనడం తెలంగాణ అంతర్జాతీయ ప్రాధాన్యతను మరింత పెంచిందని తెలిపారు. తెలంగాణలో ఇప్పటికే 1,500కు పైగా ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాలకు సేవలందిస్తున్న ఎంఎస్ఎంఈలు పనిచేస్తున్నాయని, పరిశ్రమలకు అవసరమైన అత్యాధునిక పారిశ్రామిక పార్కులు, ప్రత్యేక ఆర్థిక మండలాలు, ప్లగ్-అండ్-ప్లే మౌలిక సదుపాయాలు రాష్ట్రాన్ని దేశంలోనే అత్యంత ఆకర్షణీయ పెట్టుబడి గమ్యస్థానంగా మార్చాయని చెప్పారు. డీఆర్‌డీఓ, రక్షణ రంగ ప్రభుత్వ సంస్థలు, పరిశోధనా కేంద్రాలు, ప్రైవేట్ పరిశ్రమలు ఒకే నగరంలో ఉండటం హైదరాబాద్‌కు ప్రపంచ స్థాయి పోటీ సామర్థ్యాన్ని కల్పించిందన్నారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, ఆధునిక సాంకేతిక కేంద్రాలుగా మారుతున్న ఐటీఐలు ప్రపంచ స్థాయి ఏరోస్పేస్ పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యంతో కూడిన యువతను తీర్చిదిద్దుతున్నాయని తెలిపారు. తెలంగాణ ఏరోస్పేస్, డిఫెన్స్ రంగం గత కొన్నేళ్లుగా దాదాపు 30 శాతం వార్షిక వృద్ధిని నమోదు చేయగా, గత ఏడాది ఎగుమతులు 103 శాతం పెరిగి, రాష్ట్రానికి ఎన్నో దశాబ్దాలుగా అగ్రగామిగా ఉన్న ఔషధ రంగాన్నే అధిగమించడం తెలంగాణ పారిశ్రామిక చరిత్రలో ఒక స్వర్ణ అధ్యాయమని మంత్రి పేర్కొన్నారు. ÷ూష్ట్ర ప్రభుత్వం విమానయాన రంగ విస్తరణకు చారిత్రక నిర్ణయాలు తీసుకుందని మంత్రి వెల్లడించారు.

## సిఎంతో హెచ్‌డిఎఫ్‌సి ప్రతినిధుల భేటీ

**సిఎస్ఆర్ నిధులతో చేపట్టిన పనులు ప్రారంభం**

**హైదరాబాద్,జూన్ 30(జై భీమ్ న్యూస్):**

ఎంసీ.ఆర్.హెచ్.ఆర్డీ బోధీ పెవిలియన్ లో హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ సిఎస్ఆర్ నిధులతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో నూతన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, రాజ్య సభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, భూపాలపల్లి ఎంఎల్ ఏ గండ్ర సత్యనారాయణ రావు, సీఎంవో ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, తెలంగాణ స్టేట్ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా ఐతా ప్రకాష్ రెడ్డి ,హెచ్ డీఎఫ్ సి ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెండు అంబులెన్స్ ను ముఖ్యమంత్రి జెండా ఊపి ప్రారంభించారు. వర్చువల్ గా భూపాలపల్లిలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో మిషన్ ను ప్రారంభించారు. సమావేశం లో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ స్వయం సహాయక మహిళా సంఘాలకు విరివిగా రుణాలు మంజూరు చేయాలన్నారు. స్వయం సహాయక మహిళా సంఘాలతో లాజిస్టిక్ పార్క్ లు,గోడౌన్ లు,రైస్ మిల్లులు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. వీటి కోసం పెద్దయత్తున రుణాలు మంజూరు చేయాలని, మహిళా సంఘాలు రుణ చెల్లింపులు చాలా బాగున్నాయన్నారు.

## సిఎం రేవంత్‌తో సునీల్ మిట్టల్ భేటీ

**సమగ్ర డేటా సెంటర్ ఏర్పాటు చేయాలని సూచన**

**హైదరాబాద్,జూన్ 30(జై భీమ్ న్యూస్):**

ఎంసీఆర్ హెచ్ ఆర్డీ బోధీ పెవిలియన్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని ప్రముఖ పారిశ్రామిక వేత్త, భారతీ ఎంటర్‌ప్రైజెస్ ఛైర్మన్ సునీల్ భారతి మిట్టల్ మర్యాద పూర్వకంగా కలిసారు. సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామక్రిష్ణారావు పాల్గొన్నారు. తెలంగాణ ప్రభుత్వ విద్యలో తీసుకువస్తున్న సంస్కరణలను మిట్టల్ కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు. ప్రభుత్వ పాఠశాలను పూర్తి గా ప్రక్షాళన చేస్తున్నట్లు వివరించారు. నిరుద్యోగుల్లో నైపుణ్యాలను పెంపోందించడానికి స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఐటీఐలను ఏటీసీ లుగా మారుస్తున్నామని తెలిపారు. పాలిటెక్నిక్ కళాశాలను అభివృద్ధి చేస్తున్నాం.. చందన్‌వెల్లి డేటా సెంటర్ ప్రాజెక్టును వీలైనంత త్వరగా ప్రారంభించాలని సూచించారు. తెలంగాణలో మరింత పెద్ద సమగ్ర డేటా సెంటర్ మరియు ఎఐ మౌలిక సదుపాయాల క్యాంపస్‌ను ఏర్పాటు చేసే అవకాశాన్ని పరిశీలించాలని సూచన చేశారు. హైదరాబాద్‌లో ఎయిర్‌టెల్ డిజిటల్, క్లౌడ్, సైబర్ సెక్యూరిటీ , ఎఐకార్యకలాపాలపైన దృష్టి పెట్టాలన్నారు. భవిష్యత్ పెట్టుబడి అవకాశాలు, సమస్యలను పరిష్కరించడం కోసం తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పనిచేసేలా ఒక సీనియర్ ఎగ్జిక్యూటివ్‌ను నామినేట్ చేసి సమన్వయం చేసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. భారతీ పౌండేషన్ ద్వారా ప్రభుత్వ పాఠశాలలు, ఏటీసీల్లో చదువుకునే విద్యార్థులకు స్కాలర్ షిప్ లు అందజేస్తామని సునీల్ మిట్టల్ తెలిపారు. ఎయిర్ టెల్ కు రెండో హెడ్ క్వార్టర్ లా హైదరాబాద్ ను చూస్తున్నామని మిట్టల్ అన్నారు. డేటా సెంటర్ల కెపాసిటీని మరింత పెంచడానికి ముందుకు వస్తామని హామీ ఇచ్చారు. ఫైబర్ కనెక్టివిటీ మరింత పెంచడంపైన ఆసక్తి చూపించిన సునీల్ మిట్టల్.

# బ్యాంకు నిర్లక్ష్యానికి రూ.5 లక్షల పరిహారం

**అసలు రిజిస్ట్రేషన్ పత్రాలు పోగొట్టుకున్న ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకుపై వరంగల్ వినియోగదారుల కమిషన్ సంచలన తీర్పు**

**- 45 రోజుల్లో ఉత్తర్వుల అమలుకు ఆదేశం**

**వరంగల్ జూలై 1 (జై భీమ్ న్యూస్)**

గృహ రుణం కోసం తాకట్టుగా తీసుకున్న అసలు రిజిస్ట్రేషన్ పత్రాలను పోగొట్టుకున్న ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకుపై వరంగల్ జిల్లా వినియోగదారుల వివాద పరిష్కార కమిషన్ కీలక తీర్పు వెలువరించింది. బ్యాంకు నిర్లక్ష్యం, సేవల్లో లోపం కారణంగా బాధితురాలు శ్రీమతి మునిగాల తిరుమలకు రూ.5,00,000 పరిహారం, రూ.25,000 వ్యాజ్య ఖర్చులు చెల్లించాలని కమిషన్ ఆదేశించింది. అలాగే సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి డూప్లికేట్ రిజిస్టర్డ్ సేల్ డీడ్‌ను పొందించి అందజేయాలని, ఆమె ఆస్తి హక్కులు పూర్తిగా రక్షితంగా ఉండేలా ఇండెమ్నిటీ బాండ్‌ను అమలు చేసి కమిషన్ ఉత్తర్వుతో పాటు రిజిస్ట్రేషన్ చేయాలని స్పష్టం చేసింది. వరంగల్‌కు చెందిన శ్రీమతి మునిగాల తిరుమల ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు శ్యాంపేట్ శాఖ (ప్రస్తుతం కాకతీయ థియేటర్ సమీపంలోని శాఖ) నుంచి గృహ రుణం పొందారు. రుణాన్ని పూర్తిగా చెల్లించిన అనంతరం తాకట్టుగా బ్యాంకులో భద్రపరిచిన అసలు రిజిస్టర్డ్ సేల్ డీడ్‌ను తిరిగి ఇవ్వాలని కోరగా, ఆ పత్రాన్ని బ్యాంకు పోగొట్టుకున్నట్లు అధికారులు తెలిపారు. దీంతో బాధితురాలు ముందుగా జిల్లా న్యాయ సేవా సంస్థ (ఋూూ)ను ఆశ్రయించారు. అనంతరం ఈ ఏడాది ఫిబ్రవరిలో వరంగల్ జిల్లా వినియోగదారుల వివాద పరిష్కార కమిషన్‌లో ఫిర్యాదు దాఖలు చేశారు. విచారణ అనంతరం కమిషన్ బ్యాంకు సేవల్లో స్పష్టమైన లోపం, నిర్లక్ష్యం ఉన్నట్లు నిర్ధారిస్తూ బాధితురాలికి అనుకూలంగా తీర్పు వెలువరించింది. కమిషన్ ఉత్తర్వుల ప్రకారం బ్యాంకు 45 రోజుల్లోగా డూప్లికేట్ రిజిస్టర్డ్ సేల్ డీడ్‌ను అందజేయడంతో పాటు, బాధితురాలికి రూ.5 లక్షల పరిహారం, రూ.25 వేల వ్యాజ్య ఖర్చులు చెల్లించాల్సి ఉంటుంది. ఈ కేసులో ఫిర్యాదుదారురాలు శ్రీమతి మునిగాల తిరుమల తరపున అడ్వకేట్ రమేష్ బాబు రేకులపెల్లి సమర్థవంతంగా వాదనలు వినిపించి విజయాన్ని సాధించారు. ఇదిలా ఉండగా, కేసు నంబర్: DC/522/CC/12/2026కు సంబంధించిన రోజువారీ ఉత్తర్వు (ఋఖఅశ్రీఎ ాతీసవతీ) ఈ-జాగృతి (e-Jagriti) పోర్టల్‌లో అధికారికంగా అప్‌లోడ్ చేయబడింది. ఈ మేరకు అడ్వకేట్ రమేష్ బాబు రేకులపెల్లికి అధికారిక సమాచారం అందింది. దీంతో కమిషన్ ఇచ్చిన ఉత్తర్వులు అధికారిక రికార్డుల్లో నమోదు కావడంతో పాటు, తీర్పు అమలు ప్రక్రియకు మార్గం సుగమమైంది. వినియోగదారుల హక్కులను పరిరక్షించే దిశగా ఈ తీర్పు కీలక మైలురాయిగా న్యాయవర్గాలు అభిప్రాయపడుతున్నాయి. బ్యాంకులు తాకట్టుగా స్వీకరించే అసలు పత్రాల భద్రత విషయంలో అత్యంత బాధ్యతతో వ్యవహరించాల్సిన అవసరాన్ని ఈ తీర్పు మరోసారి స్పష్టం చేసింది.



# తెలంగాణ నూతన డీజీపీ సీవీ ఆనంద్‌కు మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు శుభాకాంక్షలు

**డీజీపీ కార్యాలయంలో మర్యాదపూర్వక భేటీ**

**రాజ్యాంగ విలువల పరిరక్షణ, ప్రజలకు న్యాయమైన పోలీసింగ్ అందించాలని ఆకాంక్ష**

**హైదరాబాద్,జూలై 1 (జై భీమ్ న్యూస్ )**

తెలంగాణ రాష్ట్ర నూతన డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ)గా బాధ్యతలు స్వీకరించిన సీవీ ఆనంద్ గారిని మాజీ మంత్రివర్యులు, మాదిగల పెద్దన్న మోత్కుపల్లి నర్సింహులు హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడుతూ, ప్రతి పౌరుడికి సమాన న్యాయం అందించే ప్రజా పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేయాలని ఆకాంక్షించారు. చట్టం ముందు అందరూ సమానులనే భావనను ఆచరణలో చూపిస్తూ, బలహీన వర్గాలు, మహిళలు, పిల్లలు, దళితులు, గిరిజనులు, వెనుకబడిన వర్గాలకు న్యాయం అందేలా పోలీసు శాఖ ప్రజల విశ్వాసాన్ని మరింత పెంపొందించాలని సూచించారు. మోత్కుపల్లి నర్సింహులు మాట్లాడుతూ,తెలంగాణ ప్రజల భద్రత, శాంతి, సామాజిక సామరస్యం, చట్టబద్ధ పరిపాలన బలోపేతంలో డీజీపీ పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. నూతన డీజీపీ సీవీ ఆనంద్ అనుభవం, పరిపాలనా దక్షత, ప్రజా దృక్పథంతో రాష్ట్ర పోలీసు శాఖ మరింత సమర్థవంతంగా పనిచేస్తుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ప్రజలకు వేగవంతమైన న్యాయం, నేరాల నియంత్రణ, సైబర్ నేరాల నివారణ, మహిళల భద్రత, యువతలో చట్టంపై అవగాహన పెంపు, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ ఆధునిక పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేయాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు. ఈ మర్యాదపూర్వక భేటీలో మాదిగ మహా శక్తి రాష్ట్ర నాయకులు ముంజగల్ల విజయ్ కుమార్, ప్రో. గుండె డప్పు కనకయ్య, వంగపల్లి శ్రీనివాస్, అడ్వకేట్ సగరపు ప్రసాద్, రిటైర్డ్ ఎస్ఐ



పోచయ్యతో పాటు పలువురు నాయకులు పాల్గొని నూతన డీజీపీకి అభినందనలు తెలిపారు. ఈ భేటీ ఆత్మీయ వాతావరణంలో కొనసాగగా, తెలంగాణ రాష్ట్రంలో ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేసే విధంగా పోలీసు శాఖ సేవలు కొనసాగాలని, రాజ్యాంగ విలువలు, సామాజిక న్యాయం, పారదర్శకత, జవాబుదారీతనం ఆధారంగా పరిపాలన సాగాలని హాజరైన నాయకులు ఆకాంక్షించారు.

# కావాలనే తెలంగాణపై బిజెపి కక్ష

**ఎరువుల సరఫరాలో తీవ్ర నిర్లక్ష్యం**

**బిజెపి, బిఆర్ఎస్ తీరుపై మండిపడ్డ మంత్రి పొన్నం**

**సిద్దిపేట,జూన్ 30(జై భీమ్ న్యూస్):**

తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం లేదు కాబట్టి ఉద్దేశపూర్వకంగా ఎరువుల సరఫరాలను తగ్గించి ఇబ్బందులు సృష్టిస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. ఎరువుల సరఫరా భారతీయ జనతా పార్టీ బాధ్యత అని చెప్పుకొచ్చారు. రైతులకు ఇబ్బంది కలగకుండా ఎరువుల సకాలంలో విడుదల చేయడంలో ఇద్దరు కేంద్రమంత్రులు బాధ్యత తీసుకోవాలన్నారు. సిద్దిపేట జిల్లాలోని హుస్నాబాద్ పట్టణంలో మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటించారు. ఈ సందర్భంగా పట్టణంలోని 17, 18 వార్డుల్లో కొనసాగుతున్న సర్ ఓటర్ సవరణ పక్రియను పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ఎరువుల తయారీ, సరఫరా కేంద్రం పరిధిలోని అంశమన్నారు. ఏ రాష్ట్రంలో కూడా ఎరువులు తయారు చేసుకోరని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తయారు చేసే ఎరువులతో పాటుగా తెలంగాణలో ఉన్న ఎరువుల ఫర్టిలైజర్ ఫ్యాక్టరీని తెలంగాణ రాష్ట్రానికి అప్పగించాలని మంత్రి డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఎరువుల కొరత ఏర్పడితే భారతీయ జనతా పార్టీ నాయకుల ఇళ్ల ముందు ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఎరువుల కొరత విషయంలో రాష్ట్ర బీజేపీ ఎంపీలు, కేంద్ర మంత్రులు జాగ్రత్తగా ఉండాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. అభివృద్ధి గిట్టని బిజెపి, బిఆర్ఎస్ నేతలు అదేపనిగా కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలకు దిగుతున్నారని మండిపడ్డారు. తమ ప్రభుత్వం చేసే మంచి పనులను జీర్ణించుకోలేక భవిష్యత్తులో అధికారం దక్కదనే ఆవేశం, ఆక్రోశంతో కేటీఆర్,హరీష్ రావులు మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. ఎవరిపైనా కక్షపూరిత చర్యలు తీసుకోవాలనే ఆలోచన ప్రభుత్వానికి లేదు. తప్పుచేసిన వాళ్లను జైలులో వేస్తేనే శిక్షించినట్లు కాదు. ప్రతి ఎన్నికల్లో వాళ్లను ఓడించి ప్రజలు శిక్షిస్తూనే ఉన్నారన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వస్తామని బీజేపీ పగటి కలలు కంటోందని మంత్రి ఎద్దేవా చేశారు. ఆశ ఉండడంలో తప్పులేదని, కానీ ఆ పార్టీ అత్యాశకు పోతోందన్నారు. బీజేపీ, బీఆర్ఎస్.. ఒకే తాను ముక్కలని విమర్శించారు. కాళేశ్వరం అవినీతి, థర్మల్ పవర్ ప్లాంట్ల అక్రమాలపై సీబీఐ విచారణ కోరితే.. కేంద్రం ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు.

# 30 నెలల్లో రూ.30 వేల కోట్ల రైతుభరోసా నిధుల ఎగవేత

**సభల పేరుతో నాటకాలు తప్ప రైతులకు చేసిందేమీ లేదు**

**మరోమారు ఎక్స్ వేదికగా రేవంత్‌పై కెటిఆర్ విమర్శలు**

**హైదరాబాద్,జూన్ 30(జై భీమ్ న్యూస్):**

30 నెలల పాలనలో రూ.30 వేల కోట్ల రైతుభరోసా నిధులను ఎగ్గొటారని, పైగా సభల పేరుతో నాటకాలు ఆడుతున్నారని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ మండిపడ్డారు. ఏకంగా నాలుగుసార్లు రైతు భరోసా నిధులను ఎగ్గొట్టారని ఆరోపించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి టార్గెట్‌గా మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి విమర్శలు గుప్పించారు. మంగళవారం హైదరాబాద్ శిల్పకళా వేదికలో సీఎం రేవంత్ రైతు భరోసా నిధులను విడుదల చేయనున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వంపై ఎక్స్ వేదికగా మాజీ మంత్రి విరుచుకుపడ్డారు. మీ 30 నెలల ముదనష్టపు పాలనలో దాదాపు రూ.30 వేల కోట్ల రైతుభరోసా ఎగ్గొట్టడమే కాకుండా మళ్లీ సభల పేరిట నాటకాలు ఆడటానికి ఏమాత్రం సిగ్గనిపిస్తలేదా? గత రెండున్నరేళ్లలో ఎగ్గొట్టిందే ఎక్కువ అని 70 లక్షల మంది రైతులు శాపనార్థాలు పెడుతుంటే.. ఆశీర్వాద సభల పేరిట డ్రామాలా? కేవలం ఒక్క బటన్ నొక్కి వేయాల్సిన రైతుభరోసాకు కూడా బహిరంగ సభ పెట్టే.. నీ పీఆర్ స్టంట్లు చూసి రైతులు అసహ్యించుకుంటున్నారు. ఒకటి కాదు రెండు కాదు.. ఏకంగా నాలుగుసార్లు రైతుభరోసా ఎగ్గొట్టిన మీ ద్రోహాన్ని రైతులు మరిచిపోతారని అనుకోవడం మీ అవివేకమే. ప్రతి ఎకరానికి ఏడాదికి రూ.15 వేలు ఇస్తానని గ్యారెంటీల గారడీ చేసి, చివరికి ఉన్నది ఊడగొట్టే దుస్థితి తెచ్చినందుకు ముందు ముక్కునేలకు రాయాలి. అరకొరగా ఒకటి, రెండు ఎకరాలకు వేసినట్టు చేసి చేతులు దులుపుకుంటున్న మీ పాపం మిమ్మల్ని నిరంతరం శాపంలా వెంటాడటం ఖాయం. ఇప్పటికే రూ.50 వేల కోట్లతో చేయాల్సిన రెండులక్షల రుణమాఫీని, చారాణా కూడా చేయకుండా అధికారంలోకి రాగానే అన్నదాత గొంతుకోశావు. 72 సార్లు నీ ఢిల్లీ టూర్లకు, పనికిరాని ఈ పబ్లిక్ మీటింగ్‌లకు పెడుతున్న కోట్ల రూపాయల ఖర్చును ఆదాచేసి ఉంటే రైతులకు పెట్టుబడి సాయం దక్కేది. రాష్ట్రవ్యాప్తంగా యూరియా దొరకక అల్లాడుతున్న అన్నదాతల కష్టాల నుంచి అటెన్షన్ డైవర్షన్ చేసే ఈ దిక్కుమాలిన చర్యలు ఏమాత్రం పనిచేయవని గుర్తుపెట్టుకో. కేంద్రం ఎంత కొంటే అంతే కొంటామని పంట కొనుగోళ్ల బాధ్యత నుంచి పూర్తిగా తప్పుకున్న మీ చేతకానితనాన్ని చూసి అన్నదాతలు పట్టలేని కోపంతో రగిలిపోతున్నారు. కేసీఆర్ టంచన్‌గా 11 సార్లు, రూ.73 వేల కోట్లను నేరుగా రైతుల ఖాతాలో వేసి రాష్ట్రంలో వ్యవసాయ విప్లవానికి నాంది పలికారు. పదేళ్లు పండగలా సాగిన వ్యవసాయాన్ని దండగలా మార్చి, రైతుకు వెన్నుపోటు పొడుస్తున్న మీ దుర్మార్గాన్ని అన్నదాతలు ఎన్నటికీ క్షమించే ప్రసక్తే లేదు. తెలంగాణ రాష్ట్ర చరిత్రలో రైతు బాంధవుడిగా కేసీఆర్ నిలిచి ఉంటే.. మీరు ఎప్పటికీ రైతు ద్రోహిగానే మిగిలి ఉంటారని గుర్తుపెట్టుకోండి' అంటూ ఎక్స్‌లో కేటీఆర్ పోస్ట్ చేశారు.

# మీ పెత్తనం సహించేది లేదు

**అసవరమైతే భారత్ సాయం కోరుతాం**

**పాకిస్థాన్‌కు పివోకే నేతల హెచ్చరిక**

**న్యూఢిల్లీ,జూన్ 30(జై భీమ్ న్యూస్):**

ఇస్లామాబాద్ నియంతృత్వ పాలనకు వ్యతిరేకంగా పాకిస్థాన్ ఆక్రమిత కాశ్మీర్‌లో నిరసనలు మిన్నంటాయి. 22వ రోజు నిరసన కార్యక్రమం సందర్భంగా పీఓకే నేతలు పాకిస్థాన్‌కు వార్నింగ్ ఇచ్చారు. పీఓకే ఇకపై పాకిస్థాన్ కంట్రోల్‌లో ఉండదని తేల్చి చెప్పారు. తమకు పాకిస్థాన్‌తో అవసరం లేదని అన్నారు. మంగళవారం రావల్‌కోట్‌లోని ఈద్గా గ్రౌండ్‌లో జరిగిన నిరసన కార్యక్రమంలో భారీ సంఖ్యలో నిరసనకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేఏఏసీ నేతలు మాట్లాడుతూ.. పాకిస్థాన్ ఆక్రమిత కాశ్మీర్ పాకిస్థాన్‌లో భాగం కాదని అన్నారు. ఆహార సరఫరాలపై ఆంక్షలు విధిస్తే భారత్ సాయం తీసుకుంటామని చెప్పారు. పాక్ ఆర్మీ చీఫ్ మునీర్ నియంతలా వ్యవహరిస్తే సహించే ప్రసక్తే లేదన్నారు. వచ్చే ఎన్నికల కోసం పీఓకే అసెంబ్లీలోని మొత్తం స్థానాల్లో 12 సీట్లను కాశ్మీరీ శరణార్థుల కోసం పాకిస్థాన్ ప్రభుత్వం కేటాయించింది. ఈ శరణార్థులు పీఓకేలో కాకుండా పాకిస్థాన్‌లోని లాహోర్, కరాచీ వంటి ప్రాంతాల్లో నివసిస్తున్నారు. దీన్ని స్థానిక ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. 12 స్థానాల రిజర్వేషన్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. మరో వైపు అధిక కరెంట్ బిల్లులు, కోతలు పీఓకే ప్రజల్ని వేధిస్తున్నాయి. పాకిస్థాన్‌కు అవసరమైన అత్యధిక హైడ్రో పవర్ పీఓకేలోని మంగ్లా డ్యామ్ ద్వారానే ఉత్పత్తి అవుతోంది. కానీ, స్థానిక ప్రజలకు మాత్రం పాక్ ప్రభుత్వం అధిక విద్యుత్ బిల్లులు వసూలు చేస్తోంది. గంటల తరబడి పవర్ కట్ విధిస్తోంది. దీంతో అక్కడి ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాదు.. పాకిస్థాన్‌లో ఉన్న తీవ్రమైన ఆర్థిక సంక్షోభం వల్ల అక్కడ గోధుమ పిండి, వంటగ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటాయి. ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీలను ఎత్తివేయడంతో సామాన్యులు తినడానికి తిండి లేక అల్లాడిపోతున్నారు. బియ్యం, విద్యుత్, గోధుమ పిండి వంటి నిత్యావసరాల ధరలు తగ్గించాలని, ప్రాథమిక హక్కులను కాపాడాలని డిమాండ్ చేస్తూ వేలాది మంది శాంతియుతంగా గత 22 రోజుల నుంచి నిరసనలు తెలియజేస్తున్నారు.

# అంటార్కిటాలో పేలిన అగ్నిపర్వతం

**బంగారం ధూలిని వెదజల్లిన లావా**



**అంటార్కిటికా,జూన్ 30(జై భీమ్ న్యూస్):**

సాధారణంగా అగ్నిపర్వతాలు లావా, బూడిద, విషవాయువులను వెదజల్లడం సాధారణమే. కానీ అంటార్కిటికాలోని మౌంట్ ఎరెబస్ అగ్నిపర్వతం మాత్రం బంగారాన్ని కూడా గాల్లోకి వెదజల్లుతోంది. మన భూమండలానికి పూర్తిగా దక్షిణ ప్రాంతంలో ఉన్న ఈ అగ్నిపర్వతం ప్రతిరోజూ సుమారు 80 గ్రాముల బంగారు ధూళిని వాతావరణంలోకి విడుదల చేస్తోందని శాస్త్రవేత్తలు ఎప్పుడో గుర్తించారు. దీని విలువ రోజుకు సుమారు 6,000 డాలర్లు (దాదాపు 5.67 లక్షలు). అంటే ఏడాదికి దాదాపు 22 లక్షల డాలర్లు (రూ.18.9 కోట్లకు పైగా) ఉంటుందని అంచనా. మౌంట్ ఎరెబస్ నుంచి వెలువడే బంగారం ఆవిరి రూపంలో ఉంటుంది. అగ్నిపర్వతం నుంచి సుమారు 1,000 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతతో బయటకు వచ్చే ఈ వేడి ఆవిరి అంటార్కిటికాలోని తీవ్రమైన చలిని తాకగానే చల్లబడి సూక్ష్మ బంగారు కణాలుగా మారిపోతుంది. ఈ కణాల పరిమాణం అత్యంత చిన్నదిగా ఉంటుంది. దీంతో అవి గాలిలో తేలుతూ దాదాపు వెయ్యి కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తున్నాయి. ఇవి చాలా సూక్ష్మ కణాలు కావడంతో వాటిని సేకరించడం లేదా వాణిజ్యపరంగా వినియోగించడం సాధ్యం కాదని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. భౌగోళిక దక్షిణ ధ్రువానికి సుమారు 1,350 కిలోమీటర్ల దూరంలో, రాస్ ద్వీపంలో ఉన్న ఈ ఎరెబస్ పర్వతం నుంచి బంగారు కణాలు పైకి వస్తున్నట్టు 1991లోనే శాస్త్రవేత్తలు గుర్తించారు. అయితే బంగారం చాలా సూక్ష్మ ధూళి రూపంలో ఉండటం, అంటార్కిటికాలోని తీవ్ర వాతావరణ పరిస్థితుల కారణంగా దానిని సేకరించడం వీలు కాదు. అంతేకాదు, ఎరెబస్ పర్వతం అంత సూక్ష్మ బంగారు స్ఫటికాలను ఎలా సృష్టించి, విడుదల చేస్తుందో కూడా శాస్త్రవేత్తలకు ఇప్పటికీ తెలియదు.


# మనం పౌరులమన్న దానికి గుర్తింపు

**ఆశారాం బాపుకు దక్కని ఊరట - బెయిల్ మంజూరుకు సుప్రీం నిరాకరణ**

**న్యూఢిల్లీ,జూన్30 (జై భీమ్ న్యూస్):**

2013లో ఓ బాలికపై అత్యాచారం కేసులో జీవిత ఖైదు అనుభవిస్తున్న స్వయంప్రకటిత ఆధ్యాత్మిక గురువు బాబా ఆశారం బాపునకు సుప్రీంకోర్టులో తాత్కాలికంగా ఊరట లభించలేదు. ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టిన న్యాయస్థానం బెయిల్ మంజూరు చేయడానికి నిరాకరించింది. తనపై విధించిన జీవిత ఖైదును సమర్థిస్తూ రాజస్థాన్ హైకోర్టు ఇచ్చిన తీర్పును ఆశారాం బాపు సుప్రీంకోర్టులో సవాలు చేశారు. ఈ పిటిషన్‌ను విచారించిన జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్ నేతృత్వంలోని ధర్మాసనం రాజస్థాన్ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. ఆశారాం పిటిషన్‌పై రెండు వారాల్లోగా కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశించింది. అయితే, రాష్ట్ర ప్రభుత్వం స్పందించే వరకు ఆశారాంకు ఎలాంటి బెయిల్ మంజూరు చేయబోమని స్పష్టం చేసింది. విచారణ సందర్భంగా ఆశారాం తరఫు న్యాయవాదులు వైద్య కారణాలను ప్రస్తావిస్తూ బెయిల్ మంజూరు చేయాలని సుప్రీంకోర్టును అభ్యర్థించారు. అయితే ప్రస్తుతం అలాంటి తక్షణ ఉపశమనానికి అవకాశం లేదని ధర్మాసనం తెలిపింది. ప్రాణాలకు ముప్పు కలిగించేంత తీవ్రమైన అత్యవసర పరిస్థితి ఉన్న సందర్భాల్లో మాత్రమే బెయిల్ అంశాన్ని పరిశీలించగలమని న్యాయస్థానం వ్యాఖ్యానించింది. రాజస్థాన్ ప్రభుత్వం సమర్పించే కౌంటర్‌ను పరిశీలించిన తర్వాతే బెయిల్‌పై తదుపరి నిర్ణయం తీసుకుంటామని ధర్మాసనం స్పష్టం చేసింది. కాగా, 2013లో రాజస్థాన్‌లో ఓ మైనర్‌పై అత్యాచారం చేసిన కేసులో ఆశారాం బాపు దోషిగా తేలారు. అనంతరం న్యాయస్థానం ఆయనకు జీవిత ఖైదు విధించింది. ప్రస్తుతం ఆశారాం జోధ్‌పూర్ జైలులో శిక్ష అనుభవిస్తున్నారు. సుప్రీంకోర్టు తాజా నిర్ణయంతో ఆయన న్యాయపరమైన పోరాటం కొనసాగుతున్నప్పటికీ, తక్షణ ఉపశమనం మాత్రం లభించలేదు. ఇప్పుడు రాజస్థాన్ ప్రభుత్వం సమర్పించే అఫిడవిట్, తదుపరి విచారణలో కోర్టు అభిప్రాయం కీలకంగా మారనున్నాయి.

# 'రంభ ఊర్వశి మేనక'.. మళ్లీ కామెడీ బాటపట్టిన అల్లరి నరేశ్




మళ్లీ తన కామెడీ జోనర్‌లోకి వచ్చిన అల్లరి నరేశ్

పుట్టినరోజు సందర్భంగా 'రంభ ఊర్వశి మేనక' ఫస్ట్ లుక్ విడుదల

సోషియో ఫాంటసీ ఎంటర్‌టైనర్‌గా రానున్న 65వ చిత్రం

అన్నపూర్ణ స్టూడియోస్, హాస్య మూవీస్ సంయుక్త నిర్మాణం

సెప్టెంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా సినిమా విడుదల

గత కొంతకాలంగా 'నాంది', 'ఉగ్రం' వంటి సీరియస్, ఇంటెన్స్ పాత్రలతో ప్రేక్షకులను మెప్పించిన ప్రముఖ నటుడు అల్లరి నరేశ్, మళ్లీ తన ట్రేడ్ మార్క్ కామెడీతో అలరించేందుకు సిద్ధమయ్యారు. అల్లరి నరేశ్ పుట్టినరోజు సందర్భంగా తన 65వ చిత్రానికి సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఈ సినిమాకు 'రంభ ఊర్వశి మేనక' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ చిత్రాన్ని ఒక సోషియో ఫాంటసీ ఎంటర్‌టైనర్‌గా రూపొందిస్తున్నారు. టైటిల్‌తోనే సినిమాలో కామెడీ, ఫాంటసీ అంశాలు పుష్కలంగా ఉంటాయని స్పష్టమవుతోంది. ప్రఖ్యాత నిర్మాణ సంస్థ అన్నపూర్ణ స్టూడియోస్, హాస్య మూవీస్ పతాకాలపై ఈ సినిమాను సంయుక్తంగా నిర్మిస్తున్నారు. చంద్రమోహన్ చింతాడ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. అల్లరి నరేశ్ కామెడీ చిత్రాలకు పెట్టింది పేరు. అయితే, నటుడిగా తనను తాను కొత్తగా ఆవిష్కరించుకునే క్రమంలో ఇటీవల సీరియస్ కథలను ఎంచుకున్నారు. ఇప్పుడు మళ్లీ తన కామెడీ జానర్‌లోకి వస్తుండటంతో అభిమానులు, సినీ ప్రేక్షకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్ సినిమాపై అంచనాలను పెంచుతోంది. ఈ సినిమాకు చైతన్ భరద్వాజ్ సంగీతం అందిస్తున్నారు. అన్ని కార్యక్రమాలను పూర్తి చేసి, 2026 సెప్టెంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు నిర్మాతలు అధికారికంగా ప్రకటించారు.

## ఇది ప్రభాస్ రేంజ్.. బ్యాంకాక్‌లో పూరి జగన్నాథ్‌కు ఎదురైన ఊహించని అనుభవం!

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ క్రేజ్ దేశ సరిహద్దులు దాటి ప్రపంచవ్యాప్తంగా ఏ స్థాయిలో విస్తరించిందో చెప్పే ఓ ఆసక్తికర సంఘటన తాజాగా వెలుగులోకి వచ్చింది. కేవలం 'నేను ప్రభాస్ స్నేహితుడిని' అని చెప్పినందుకు ప్రముఖ దర్శకుడు పూరి జగన్నాథ్‌కు బ్యాంకాక్‌లోని ఓ ఆసుపత్రిలో ఊహించని రీతిలో వీఐపీ ట్రీట్‌మెంట్ లభించింది. ఈ విషయాన్ని ప్రభాస్ స్వయంగా ఇటీవల విడుదలైన 'బాహుబలి: ది టార్చ్ బేరర్' అనే డాక్యుమెంటరీలో అభిమానులతో పంచుకున్నారు. ప్రభాస్ కథనం ప్రకారం.. 'బాహుబలి: ది బిగినింగ్' విడుదలై ప్రపంచవ్యాప్తంగా సంచలనాలు సృష్టిస్తున్న రోజుల్లో ఈ సంఘటన జరిగింది. దర్శకుడు పూరి జగన్నాథ్ ఓ చిన్న ఇన్ఫెక్షన్ కారణంగా చికిత్స కోసం బ్యాంకాక్‌లోని ఓ ప్రముఖ ఆసుపత్రికి వెళ్లారు. అక్కడ తన వంతు కోసం వెయిటింగ్ రూమ్‌లో కూర్చుని ఉండగా, ఓ నర్స్ ఆయన వద్దకు వచ్చి ఇండియా నుంచి వచ్చారా? అని అడిగింది. ఆయన అవునని సమాధానం ఇవ్వగానే, ఆమె వెంటనే 'బాహుబలి?' అని ప్రశ్నించింది. ఆమె ప్రశ్నకు ఆశ్చర్యపోయిన పూరి జగన్నాథ్, తన ఫోన్‌లోని ఓ పర్సనల్ ఫొటోను చూపించారు. ఆ ఫొటోలో ఆయన ప్రభాస్‌తో కలిసి ఉన్నారు. తాను ప్రభాస్‌కు మంచి స్నేహితుడినని ఆ నర్స్‌కు వివరించారు. ఆ ఫొటో చూసిన నర్స్ వెంటనే ఆసుపత్రి సిబ్బందిని అప్రమత్తం చేసింది. దీంతో పూరి జగన్నాథ్‌కు ఎలాంటి వెయిటింగ్ సమయం లేకుండా నేరుగా ఒక ప్రత్యేక గదికి తీసుకెళ్లి, తక్షణమే వైద్య సేవలు అందించారు. ఈ అనూహ్య అనుభవాన్ని పూరి జగన్నాథ్ వెంటనే వాయిస్ మెసేజ్ రూపంలో ప్రభాస్‌కు పంపించారు. ఆ సమయంలో దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి, నిర్మాత శోభు యార్లగడ్డతో కలిసి ఉన్న ప్రభాస్, ఆ వాయిస్ మెసేజ్ విని ఆశ్చర్యానికి గురయ్యారు. జపాన్ వంటి దేశాల్లో 'బాహుబలి'కి, ప్రభాస్‌కు భారీ ఫ్యాన్ ఫాలోయింగ్ ఉందని వారికి తెలుసు. కానీ, ఎవరూ ఊహించని విధంగా బ్యాంకాక్‌లోని ఓ సాధారణ ఆసుపత్రిలో కూడా 'బాహుబలి' ప్రభావం ఈ స్థాయిలో ఉండటం చిత్రబృందాన్ని సైతం ఆశ్చర్యపరిచింది. ఇది ప్రభాస్ గ్లోబల్ స్టార్‌డమ్‌కు నిదర్శనంగా నిలిచింది. ఇదే డాక్యుమెంటరీలో ప్రభాస్, రానా దగ్గుబాటి, అనుష్క శెట్టిలు 'బాహుబలి 3' చిత్రంపై పరోక్షంగా కొన్ని హింట్స్ ఇవ్వడం అభిమానుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతోంది. ఇక, ప్రభాస్ కెరీర్ విషయానికొస్తే.. ప్రస్తుతం ఆయన వరుస పాన్ ఇండియా చిత్రాలతో బిజీగా ఉన్నారు. హను రాఘవపూడి దర్శకత్వంలో 'ఫౌజీ', సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో 'స్పిరిట్', అలాగే 'కల్కి 2898 ఏడీ' చిత్రానికి సీక్వెల్ కూడా ఆయన లైనప్‌లో ఉన్నాయి.





## హీరోయిన్ హనీ రోజ్ కు క్షమాపణ చెప్పిన వ్యాపారవేత్త

కేరళకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త బాబీ చెమ్మనూర్ హీరోయిన్ హనీ రోజ్‌కు బహిరంగంగా క్షమాపణలు చెప్పారు. ఒక జ్యువెలరీ షోరూమ్ ప్రారంభోత్సవ వేడుకలో హనీ రోజ్‌ను ఉద్దేశించి ఆయన చేసిన కొన్ని వ్యాఖ్యలు తీవ్ర వివాదానికి దారితీశాయి. తనపై లైంగిక భావనలతో కూడిన, అవమానకరమైన వ్యాఖ్యలు చేశారంటూ హనీ రోజ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో చెమ్మనూర్‌పై క్రిమినల్ కేసు నమోదైంది. ఈ నేపథ్యంలో, బాబీ చెమ్మనూర్ తన ఫేస్‌బుక్ ఖాతా ద్వారా స్పందిస్తూ, తన వ్యాఖ్యలు హనీ రోజ్‌ను, ఆమె కుటుంబాన్ని బాధపెట్టాయని గ్రహించానని... ఈ ఉదంతానికి పూర్తి బాధ్యత వహిస్తూ మనస్ఫూర్తిగా క్షమాపణలు కోరుతున్నానని ప్రకటించారు. ఆమెను బాధపెట్టాలనే ఉద్దేశం తనకు ఏమాత్రం లేదని, ఈ సమస్యను సానుకూలంగా పరిష్కరించుకోవడానికి తాను సిద్ధంగా ఉన్నానని పేర్కొన్నారు. అలాగే ఆమె తనపై పెట్టిన కేసును ఉపసంహరించుకుంటారని ఆశిస్తున్నట్లు తెలిపారు. మరోవైపు, ఈ వివాదంపై గతంలో మాట్లాడిన హనీ రోజ్... తన లుక్స్‌పై వచ్చే సరదా జోకులను, మీమ్స్‌ను తాను కూడా స్పోర్టివ్‌గా తీసుకుంటానని, కానీ ప్రతి దానికి ఒక హద్దు ఉంటుందని స్పష్టం చేశారు. అసభ్యకరమైన, గౌరవానికి భంగం కలిగించే వ్యాఖ్యలను ఏమాత్రం సహించేది లేదని ఆమె తేల్చి చెప్పారు. వ్యాపారవేత్త చెమ్మనూర్ చేసిన ఈ బహిరంగ క్షమాపణలపై హనీ రోజ్ ఇంకా స్పందించాల్సి ఉంది.

# 'సూపర్ సుబ్బు'తో ఓటీటీలోకి మురళీ శర్మ.. ఆసక్తికర పాత్రలో విలక్షణ నటుడు

విలక్షణ నటుడిగా సినీ పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న మురళీ శర్మ, ఇప్పుడు ఓటీటీ ప్రపంచంలోకి అడుగుపెడుతున్నారు. ఆయన నెట్‌ఫ్లిక్స్ తొలి తెలుగు ఒరిజినల్ సిరీస్ అయిన 'సూపర్ సుబ్బు'లో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇందులో ఆయన కుక్కుటేశ్వర రావు అనే సంప్రదాయవాద తండ్రి పాత్రలో కనిపించనున్నారు. తన కొడుకు సెక్స్ ఎడ్యుకేషన్ టీచర్ కావాలని నిర్ణయించుకోవడంతో, ఆ తండ్రి నమ్మకాలు, సిద్ధాంతాలు ఎలాంటి కుదుపులకు గురయ్యాయనేది ఈ కథ యొక్క ముఖ్యమైన అంశం. తన ఓటీటీ అరంగేట్రంపై మురళీ శర్మ ఆనందం వ్యక్తం చేశారు. ఈ కథ ప్రేక్షకులను నవ్విస్తూనే, సమాజంలో చర్చించడానికి ఇబ్బందిపడే కొన్ని సున్నితమైన విషయాలను సున్నితంగా చర్చిస్తుందని తెలిపారు. "కామెడీ, కుటుంబ డ్రామా, సామాజిక అంశాలను ఈ సిరీస్ అద్భుతంగా మిళితం చేసింది. నెట్‌ఫ్లిక్స్ తొలి తెలుగు సిరీస్‌లో భాగం కావడం గొప్ప అనుభవం. ఈ సిరీస్‌లోని మాకీపూర్ ప్రపంచం ప్రేక్షకులకు బాగా కనెక్ట్ అవుతుంది" అని ఆయన వివరించారు. ఈ ప్రాజెక్టులోకి ఎలా వచ్చారనే విషయాన్ని కూడా మురళీ శర్మ పంచుకున్నారు. "టిల్లు స్క్వేర్ సినిమా షూటింగ్ సమయంలోనే దర్శకుడు మల్లిక్ ఈ సిరీస్ గురించి, నా పాత్ర గురించి చెప్పారు. ఆ సినిమాతో మా మధ్య మంచి అనుబంధం ఏర్పడింది. అతను అధికారికంగా కథ వినిపించినప్పుడు చాలా సంతోషంగా అనిపించింది" అని అన్నారు. గతంలో సందీప్ కిషన్‌తో ఐదు సినిమాలు, మిథిలా పాల్కర్‌తో ఒక తెలుగు సినిమా చేశానని, వారితో తనకున్న అనుబంధం కారణంగా సెట్స్‌లో వాతావరణం సరదాగా గడిచిపోయిందని మురళీ శర్మ పేర్కొన్నారు.

